

నరసన్న పెళ్లికి రారండి..



చంద్రప్రభ వాహనంపై ఊరేగింపు

అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాలు మంగళవారం రాత్రి నుంచి ఆరంభమయ్యాయి. ఆదిదేవుడు లక్ష్మీనరసింహస్వామిని పెండ్లి కొడుకుగా.. అమ్మవారిని పెండ్లి కుమార్తెగాను ముస్తాబు చేశారు.. ఈ క్రతువు తిలకించేందుకు వేలాదిగా భక్తజనం తరలివచ్చారు.. ఇక 7వ తేదీన స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. ఉత్సవాలు 13వ తేదీ వరకూ జరుగుతాయని ఆలయ అధికారులు తెలిపారు. - వివరాలు 6లో

అడవిలో..అలజడి!





మంగళవారం మధ్యాహ్నం ఆకాశంలో పెద్ద ఎత్తున పొగలు కమ్ముకున్నాయి.. ఎక్కడి నుంచి వస్తున్నాయి.. ఎలా వస్తున్నాయి అనే అలజడి.. ఎక్కడో ఏదో జరిగిపోతోందన్న ఆందోళన.. ఏం జరుగుతుందో తెలియదు.. జాతీయ రహదారిపై కూడా పెద్దఎత్తున పొగలు కమ్ముకున్నాయి. పరిసర ప్రాంతాల ప్రజానీకం చాలామంది అప్పటికే అప్రమత్తమై పోయారు. అయితే చాలాసేపటి తర్వాత రాజమహేంద్రవరానికి కూతవేటు దూరంలో ఉన్న రిజర్వు ఫారెస్టులో మంటలు చెలరేగాయని తెలియడంతో కొంత ఊపిరి పీల్చుకున్నారు.. ఆ తర్వాత మంటలను అదుపుచేశారు. కాగా మంత్రి దుర్గేష్ దహనమైన అడవిని పరిశీలించారు. - వివరాలు 7లో



ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

వైద్యులు సమయపాలన పాటించాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి (జీటీజీహెచ్)ను కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎప్పుడూ ముందస్తు సమాచారంతో వచ్చే కలెక్టర్ ఈ సారి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఆకస్మికంగా రావడంతో ఆసుపత్రి అధికారులు, వైద్యులు, సిబ్బంది పరుగులు పెట్టారు. ప్రత్యేకించి అవుట్‌పేషెంట్ విభాగాలను కలెక్టర్ సందర్శించి అక్కడ వైద్యులు, వైద్య సహాయకులు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. జనరల్ మెడిసిన్‌తో పాటు ఇతర విభాగాలను పరిశీలించారు. ఎంసీహెచ్ బ్లాకులోని ప్రసూతి, పిల్లల విభాగాన్ని సందర్శించారు. వైద్యులు సమయపాలన పాటిస్తున్నారా లేదా అనేదానిపైనా దృష్టి సారించారు. హాజరుపట్టీని కూడా పరిశీలించారు. జనరల్ మెడిసిన్ విభాగంలో ఇద్దరు వైద్యులు గైర్హాజరుపై కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆసుపత్రి వేక్షణాధికారిగా ఉన్న సూపరింటెండెంట్ ఈ విషయంలో కీలకంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజలకు వైద్యసేవలందించే క్రమంలో డాక్టర్లు కచ్చితంగా సమయపాలన పాటిస్తూ అందుబాటులో ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు.ఆమె వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ, ప్రత్యేకాధికారి డి.భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

సమగ్ర శిక్ష సెక్టోరియల్ పోస్టులకు
దరఖాస్తులు ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఏపి సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వారి మౌఖిక ఆదేశాల మేరకు జిల్లాలో గల సమగ్ర శిక్షా రాజమహేంద్రవరం కార్యాలయంలోని సెక్టోరియల్ పోస్టులు, ప్లానింగ్ అండ్ ఎంఐఎస్ కోఆర్డినేటర్, అసిస్టెంట్ అల్టర్నేటివ్ స్కూల్ కోఆర్డినేటర్, గరల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నమని సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎస్ సుభాషిణి తెలిపారు.ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ పోస్టులకు స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్మెంట్‌లో పనిచేస్తున్న 55 ఏళ్ళలోపు వయసు సుమారు 8 ఏళ్ల సర్వీసు ఉన్న స్కూల్ అసిస్టెంట్లు అర్హులని తెలిపారు.మరింత సమాచారం కోసం సమగ్రశిక్ష ఎఎస్‌వో ప్రసాద్ 94419 08345 నెంబరును సంప్రందించాలన్నారు.



కొవ్వూరు బీసీ హాస్టల్‌లో
ఆర్‌డీవో విచారణ

కొవ్వూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు ప్రభుత్వ బాలుర బీసీ వసతిగృహంలో మంగళవారం రాత్రి కొవ్వూరు ఆర్డీవో డా.రాణి సుస్మిత విచారణ చేపట్టారు. హాస్టల్‌కు వెళ్లి విద్యార్థులు, వసతిగృహ అధికారి, సిబ్బందిని విచారించారు.ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ ఆదివారం హాస్టల్‌లో మతపరమైన ప్రార్థనలు జరుగుతున్నాయని వచ్చిన వార్తలపై విచారణ చేపట్టడం జరిగిందన్నారు.బీసీ హాస్టల్ అద్దె భవనంలో కొనసాగుతుందన్నారు. భవన యజమానులు ఆదివారం మధ్యాహ్నం భవనం పైఅంతస్తులో ఎవరికీ చెప్పకుండా పైకి వచ్చి ప్రార్థనలు నిర్వహించడానికి సన్నాహాలు చేశారన్నారు. అదే విధంగా విద్యార్థులు ప్రార్థనలు మాకు ఇష్టం లేదని భవనం కిందకు వచ్చేశామని ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరుగుతుందన్నారు. ఈ రెండు అంశాలపై పూర్తిగా విచారించి నివేదికను జిల్లా కలెక్టరుకు అందిస్తామన్నారు. అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికా రి, వసతిగృహ అధికారి చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి నిమిత్తం ఎక్కడో తమిళనాడు నుంచి వచ్చారు.. జిల్లాలోని ఒక పట్టణంలో స్థిరపడ్డారు. ఏ బాదరబందీ లేదు.. ఒక్కతే కుమార్తె.. అమ్మాయిది డిగ్రీ పూర్తయింది.. ఉద్యోగమూ వచ్చేసింది.. ఆ తల్లిదండ్రులకు ఇంకేం ఆలోచన ఉంటుంది..మంచి అబ్బాయిని చూసి పెళ్లిచేయడమే తరువాయి..ఇలా అనుకుంటుండగానే ఆ అమ్మాయి చేసిన స్నేహం కుటుంబ ఆర్థిక పరిస్థితిని ఛిన్నాభిన్నం చేసింది.. నాకు అడిగినంతా ఇవ్వకపోతే నీ న్యూడ్ వీడియోలు నెట్‌లో పెడతానని బెదిరించడంతో యువతి.. తల్లిదండ్రులు బెదిరిపోయారు.. అడినంతా ఇచ్చి అప్పులపాలయ్యారు. సొంతిల్లు వదిలేసి అద్దె ఇంట్లో తలదాచుకోవాల్సిన పరిస్థితికి తెచ్చింది.. చివరికి చేసేదేంలేక పోలీసులను ఆశ్రయించడంతో ఐదేళ్ల ఆవేదన బయటకొచ్చింది.



కొవ్వూరుకు చెందిన ఒక బాలిక ఇంటర్ చదువుతోంది.. తల్లిదండ్రులకు కష్టమైనా రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు కళాశాలలో చదివిస్తున్నారు.. ఆ అమ్మాయిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.. అయితే చదువుకోవడానికి వెళ్లిన అమ్మాయి అక్కడ అధ్యాపకుడు చెప్పిన మాయమాటలకు లొంగిపోయింది.. ఇటీవల అతను వెంట తీసుకెళ్లిపోయి అత్యాచారానికి ఒడిగట్టాడు. కంగారుపడిన తల్లిదండ్రులు పోలీ సులకు ఫిర్యాదు చేయడంతో ఇద్దరినీ పట్టుకున్నారు.. బాలిక ఫిర్యాదు మేరకు అధ్యాపకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.



అమ్మాయిలూ.. జాగ్రత్త!

ప్రస్తుత సమాజంలో అమ్మాయిలు మోసపోతున్న ఘటనలు సర్వసాధారణంగా మారిపోయాయి.. ప్రతి రోజూ ఏదో ఒక మూల కేసులు నమోదవుతూనే ఉన్నాయి.అయినా అమ్మాయిల్లో మాత్రం మార్పురావడం లేదు.. స్మార్ట్ ఫోన్లు.. దానికి తగినట్టు స్నేహాలు అమ్మాయిల జీవితాలను అడ్డదారి పట్టిస్తున్నాయనడంలో సందేహం లేదు. జిల్లా వ్యాప్తంగా గతేడాది చూస్తే 43 పోక్సో కేసులు నమోదయ్యాయి.145 అమ్మాయిల మిస్సింగ్ కేసులు ఉన్నాయి.. వివాహిత మహిళల అదృశ్యం కేసులు 258.. ఇవి పోలీస్ స్టేషన్లకు వరకూ వచ్చినవి..రానివి ఎన్నో చెప్పడం కష్టమే.. ఈ కేసుల్లో ప్రతి కేసూ ఒక కథే.. మోసపోయిన జీవితగాథలే.. కొంత మంది ఆ మోసాల నుంచి బయటపడుతుంటే.. మరికొంత మంది భరించలేక ప్రాణాలే తీసుకుంటున్నారు..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రేమ.. ఆకర్షణ.. అవసరం.. వాంఛ.. వీటి మధ్య ఉన్న సున్నితమైన గీతను గుర్తించడంలో విఫలమవుతున్న అమ్మాయిలు అమాయకంగా తమంతట తాముగా వెళ్లి తమ జీవితాలను, తమ తల్లిదండ్రుల ఆశలను ఛిద్రం చేసే వలకు చిక్కుతూ చిక్కుముడుల సుడిగిండంలో ఇరుక్కుంటున్నారు. తీరా ఆ 'క్షణాల' తప్పును గ్రహించే సరికి వేధింపుల గుప్పిట్లో బందీలవుతున్నారు. భారతీయ సంస్కృతిలో ఆడవారికి ఓ ప్రత్యేకమైన స్థానం ఉంది.ఎంతో గౌరవాన్ని ఇచ్చింది. కానీ ఇవాళ పాశ్చాత్య పోకడల వెర్రిలో తెల్ల కాగితంలా ఉండాల్సిన జీవితాలు మసిబారిపోతున్నాయి. ఇటు తల్లిదండ్రులను సమాజంలో, బంధువుల్లో చులకన చేస్తున్నారు. ఆలోచనా లేమితో కొందరు అమ్మాయిలు చేస్తున్న చక్కదిద్దుకోలేని పొరబాట్లకు ప్రతిక్షణం కుంగిపోతూ జీవచ్ఛవాల్లా బతుకుతున్న అమ్మానాన్నలు ఎంతో మంది ఉన్నారు. కొందరు అమ్మాయిలు కెరీర్ అంటూ ముందుకు దూసుకుపోతుంటే..మరికొందరు 'క్షణాల్లో' జీవితాన్ని పాడు చేసుకుంటున్నారు.చాలా మంది సెల్‌ఫోన్ల వల్ల పతనం అవుతున్నారనేది నిర్వివాదాంశం. అందుకే..'అమ్మాయిలూ..కాస్త ఆలోచించండమ్మా!'. స్నేహమన్నా.. జాగ్రత్తగా ఉండాల్సిందే..

అత్యాచార కేసులు 43.. అమ్మాయిల మిస్సింగ్ 145

తూర్పు గోదావరి పోలీసు రికార్డుల ప్రకారం గతేడాది 18ఏళ్ల పైబడిన వారిపై 23,18ఏళ్ల లోపు అంటే పిల్లలపై 43 అత్యాచార కేసులు నమోదయ్యాయి. ఈ 43 కేసుల్లో ఓ ఏడు తప్ప..36 ప్రేమ పేరుతో పరారైనవే కావడం గమనార్హం. ఇక ఆ 23 కేసుల్లో నాలుగు తప్ప మిగతా వాటిలో పెళ్లి చేసుకుంటామని చెప్పినవి ఉన్నాయి.ఈ గణాంకాలు చూస్తుంటే ఎంత మంది తల్లిదండ్రులు శోకంలో జీవిస్తున్నారో.. బంధువులు, ఇరుగుపొరుగు వారి ముందు తలదించుకొని బతుకుతున్నారో అర్థం చేసుకోవచ్చు. గతేడాది ఆడపిల్లల మిస్సింగ్ కేసులు 145 నమోదు కాగా 142 మందిని పోలీసులు గుర్తించి తీసుకొచ్చారు. మహిళల అదృశ్యం కేసులు 258 ఉండగా 233 మందిని పోలీసులు గు ర్తించారు.ఇవి పోలీస్ స్టేషన్ల వరకూ వచ్చిన కేసులు మాత్రమే..రాని కేసులు చాలానే ఉంటాయి. ఎందుకంటే పరువు పోతుందనే కారణంగా పోలీస్ స్టేషన్ల వరకూ రాని కేసులు పదుల సంఖ్యలో ఉంటాయి.మాయమాటలతో విసిరే వలలో చిక్కుకొని జీవితాలు నాశనం చేసుకోవద్దంటూ ఉదాహరణలను వివరిస్తూ పోలీసులు అవగాహన కల్పిస్తున్నా కొందరు అమ్మాయిలు ఇంకా జీవిత సత్యాన్ని గ్రహించలేక పోవడం బాధాకరంగా కానవస్తోంది.

స్నేహం ముసుగులో మోసాలు

స్నేహం మాటున..

స్నేహం మాటున ఇవాళ జరుగుతున్న ఆకృత్యాలు అమ్మాయిల జీవితాలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. కట్టు తప్పుతూ పట్టు కోల్పోతున్నారు. తమ ఆత్మాభిమానాలను సైతం ఇతరుల చేతిలో బంధీ చేస్తున్నారు. ఎక్కడో ఏదో సందర్భంలో స్నేహమంటూ నాలుగు మాటలు కలుపుతారు. దానిని కొద్ది రోజులు సాగదీస్తూ వెళతారు. ఆపై ఆకర్షణకు లొంగిపోతారు. చిక్కుముడిలో చిక్కిపోతున్నారు. గతంలో స్నేహం చేశారంటే ఒక నమ్మకం ఉండేది.. నేడు అవసరమే స్నేహంగా మారింది.అది గుర్తించలేని అమ్మాయిలు మోసగాళ్ల వలకు చిక్కి బలైపోతున్నారు. ఆధునిక జీవులం అనుకుంటూ అందరినీ ఆవేదనకు గురి చేస్తున్నారు. ఆడ పిల్ల పుట్టిన నాటి నుంచే ఎంతో పొందికగా పెంచి పెద్ద చేయాలని పెద్దలు తాపత్రయ పడతారు. అలాగే పెంచుతారు. అయితే చిన్న తప్పుతో జీవితాలను బలిచేసుకుంటున్నారు.

- ప్రేమ పేరుతో యువకుల వల
- చిక్కిపోతున్న అమ్మాయిలు
- స్మార్ట్ ఫోన్లతో పతనం
- బలహీన క్షణాల్లో బంధీగా
- తల్లిదండ్రుల ఆశలపై నీళ్లు
- చివరికి మిగిల్చేది కన్నీళ్లు
- పోలీస్‌స్టేషన్లలో కేసులు
- నిడదవోలు ఘటనే నిదర్శనం
- గతేడాది అత్యాచార కేసులు 43
- యువతుల మిస్సింగ్ 145
- మహిళల అదృశ్యం 258
- పోలీసులకూ సవాల్

నేడు జిల్లాలో ఇన్‌చార్జి మంత్రి
నిమ్మల పర్యటన

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు కేడర్‌ను సమాయత్తం చేయడానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు బుధవారం మంత్రి కందుల దుర్గేష్ తో కలిసి జిల్లాలో పర్యటించనున్నారు. బుధవారం ఉదయం 9 గంటలకు నిడదవోలు, 11 గంటలకు గోపాలపురం, మధ్యాహ్నం 1గంటకు కొవ్వూరు, సాయంత్రం 3 గంటలకు రాజానగరం, 5 గంటలకు రాజమహేంద్రవరం అర్బన్, 6.30 గంటలకు రాజమండ్రి రూరల్ కూటమి శ్రేణుల సమావేశాల్లో పాల్గొంటారు. నిడదవోలు పరిధిలోని కానూరు వైనాట్ ఫంక్షన్ హాల్, దేవరపల్లి,కొవ్వూరు, మధురపూడి టీడీపీ ఆఫీసుల్లో, రాజమండ్రి సిటీ, తర్వాత ప్రియాంక గార్డెన్స్ మీటింగ్‌లో పాల్గొంటారు.

ఇంటి కోసం గొడవ..
వివాహిత ఆత్మహత్య



నల్లజర్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలు ఒక వివాహిత ప్రాణం తీశాయి. నల్లజర్ల మండలం పోతవరం పంచాయతీ కృష్ణాయిగూడెం గ్రామానికి చెందిన జొన్నకూటి సుబ్బారావు కుమారుడు రాజు కోమటికుంటకు చెందిన నాగదుర్గ(26)ని సుమారు ఆరేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు.వీరికి కుమారుడు,కుమార్తె ఉన్నారు.నాటి నుంచి అత్తమామలతో కలిసే జీవి స్తుంది. భర్త చిన్న పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెలకొస్తున్నాడు. ఇదిలా ఉండగా ఇటీవల తాము ఉంటున్న ఇంటి విషయమై మామ సుబ్బారావు,బావ గంగరాజు కలిసి నాగదుర్గతో గొడవపడుతున్నారు. ఇదిలాఉండగా ఇటీవల నల్లజర్లలో పోలీసులకు బావ గంగరాజుపై మరదలు దుర్గ ఫిర్యాదు చేసింది.పోలీసులు పట్టించుకోలేదు. దీంతో వేధింపులు మరింత ఎక్కువయ్యాయి. తట్టుకోలేకపోయిన నాగదుర్గ తీవ్ర మనస్తాపానికి గురైంది. సోమవారం భర్త పనిలోకి వెళ్లిన తరువాత పిల్లలను స్కూల్‌కి పంపించి బట్టలు నానబెట్టుకుంది. అనంతరం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.అత్తగారు గమనించి చుట్టుపక్కల వారిని పిలిచి కిందకు దింపారు.అప్పటికే ఆమె మృతి చెందిఉంది.పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు తరలించారు. మృతురాలి తండ్రి సేనాపతి సుబ్బారావు ఫిర్యాదు మేరకు అత్తమామలైన సుబ్బారావు, సువార్త, బావగారు గంగరాజు, ఆడబడుచు పున్నమ్మలపై కేసు నమోదు చేశారు.

8న ధవళేశ్వరం
జనార్దనస్వామి రథోత్సవం

ధవళేశ్వరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కొండపై కొలువైన లక్ష్మిజనార్దన స్వామి కల్యాణోత్సవాలు 8 నుంచి 13 వరకు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ మేరకు ఆలయ ప్రాంగణం కొండ పైకి వెళ్లే మెట్ల మార్గాన్ని రంగులతో,చలువ పందిళ్ళతో అందంగా తీర్చిదిద్దుతున్నారు.దిగువున మెట్ల మార్గం నుంచి రామపాదాల ఘాట్ వరకు ఉన్న రహదారి పొడవునా చలువ పందిళ్లు వేసి విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు.8న రథోత్సవం నేపథ్యంలో దక్షిణ మండలి డీఎస్పీ భవ్య కిషోర్, సీఐ పి.గణేష్‌లు, ఏఎస్‌ఐలు మంగళవారం ఆలయ పరిసరాలతో పాటు రథోత్సవం జరిగే రహదారిని పరిశీలించి బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. ఆలయ ఈవో కె. సురేష్ భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. రథసప్తమిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం స్వామి వారి రథానికి ఆలయ అర్చకుడు ఎస్‌వీఎస్ఎన్ ఆచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. పడమర ముఖంగా ఉన్న రథాన్ని భక్తులు తూర్పు ముఖంగా నిలిపారు.

కాలువలకు నీరు విడుదల

ధవళేశ్వరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కాటన్ బ్యారేజ్ నుంచి డెల్టా కాలువలకు 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టా కాలువకు 2300 క్యూసెక్కులు,మధ్యడెల్టా కాలువకు 1700, పశ్చిమడెల్టా కాలువకు 4 వేల క్యూసెక్కులు చొప్పున విడుదల అవుతుంది.నీటిమట్టం 9.40 అడుగులుగా ఉంది.సీలేరు నుంచి పవర్ జనరేషన్ ద్వారా 3800 క్యూసెక్కులు గోదావరిలో కలుస్తుండగా గోదావరిలో నీటిలభ్యత 8,692 క్యూసెక్కులుగా ఉంది.

ఆక్రమిత నివాస స్థలాల క్రమబద్ధీకరణ

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని నివాసాలు ఏర్పాటు చేసుకున్న అభ్యంతరం లేని పేదల ఇళ్ల స్థలాలను క్రమ బద్ధీకరించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని కలెక్టర్ పి. ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు గత నెల 29న జీవో 30ని విడుదల చేశారన్నారు. ఈ పథకం కింద నివాస స్థలాలను క్రమబద్ధీకరించుకునేవారు ఈ ఏడాది డిసెంబర్ 31 లోపు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. గ్రామాల్లో రూ.1.20 లక్షల వార్షికాదాయం, పట్టణాల్లో 1.44 లక్షల వార్షికాదాయం ఉన్న బీపీఎల్ కుటుంబాలన్నీ అర్హులేనన్నారు. ఈ పథకం జీవిత కాలంలో ఒక్కసారే వర్తిస్తుందని స్పష్టం చేశారు. బేసిక్ వేల్యూ చెల్లింపు, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియ చేపడతామన్నారు. అర్హత కలిగిన లబ్దిదారులు తమ పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గతంలో దరఖాస్తు చేసిన వారు తగిన ఆధారాలు, డాక్యుమెంట్లతో కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, నిర్ధారణ చేసిన తర్వాత అర్హులకు కేటాయిస్తారన్నారు. అర్హుల జాబితాను రెవెన్యూ డివిజనల్ స్థాయి కమిటీ పరిశీలించి, ఆమోదిస్తుందన్నారు.

ఈ-శ్రమ్‌లో నమోదైతే ఉపాధి

ఈ-శ్రమ్ కార్డు వల్ల ఉపయోగాలను అసంఘటిత రంగ కార్మి కులకు వివరించడంతో పాటు ప్రతి ఒక్కరూ ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకొనే విధంగా అవగాహన కల్పించాలని అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు.ఈ అంశంపై మంగళవారం సమీక్షించారు. జిల్లాలో ఇప్పటి వరకూ 6,03 లక్షల మందిని ఈ-శ్రమ్‌లో రిజిస్ట్రేషన్ చేశారన్నారు. ఈ పోర్టల్‌లో నమోదుకు బ్యాంకు అకౌంట్, ఆధార్ జిరాక్సులు,ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ నెంబరు అవసరమన్నారు. ఈ శ్రమ్‌లో నమోదైతే ఉపాధి అవకాశాలుంటాయన్నారు.

50 డివిజన్లకు ప్రత్యేకాధికారులు

- శానిటేషన్ బాధ్యత వారిదే
- కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగర ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ప్రతి వార్డుకు ఒక ప్రత్యేక అధికారిని నియమించినట్టు కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం డివిజన్ ప్రత్యేక అధికారులుగా నియమించిన వారితోను,అధికారులతోను కమిషనర్ సమావేశం నిర్వహించారు. నగరాభివృద్ధికి చేస్తున్న కార్యక్రమాలు పర్యవేక్షించి ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, పారిశుధ్య విభాగాలతో సమన్వయంతో చేయడం కోసం 50 డివిజన్లలో నగరపాలక సంస్థ సిబ్బంది, అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిచడం జరిగిందన్నారు.ప్రత్యేక అధికారులుగా కేటాయించిన వారు తమకు కేటాయించిన వార్డుల్లో ప్రత్యేకంగా శానిటేషన్, కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించే కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలను పూర్తిస్థాయిలో పర్యవేక్షించి మొదటి పది ర్యాంకుల్లో ఒక ర్యాంక్ సాధించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. వార్డుల వారీగా వీధి దీపాల నిర్వహణ , నీటి సరఫరా మెరుగ్గా అందేలా చూడడం ప్రత్యేక అధికారుల బాధ్యత అని సూచించారు.సమావేశంలో డిప్యూటి కమిషనర్ ఎస్.వెంకట రమణ, ఎస్ఈ జి.పాండురంగారావు, సిటీప్లానర్ కోటయ్య, మునిసిపల్ ఆరోగ్యఅధికారి డాక్టర్ ఎ . వినూత్న, మేనేజరు అబ్దుల్ మాలిక్ అన్సర్, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

బయటకు రావాలంటేనే భయం..భయం!

- జిల్లాలో పెరుగుతున్న నేరాలు
- అచ్చన్నపాలెంలో భారీ చోరీ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిస్థితులు మారుతున్నాయి.. చోరీలు, చైన్ స్నాచింగ్‌లు పెరిగిపోయాయి.రౌడీ మూకలు, అసాంఘిక శక్తులు పేట్రేగుతున్నాయని 'ఆంధ్రజ్యోతి' చెబుతూనే ఉంది. పోలీస్ బాస్‌లకు కొంత ఇబ్బందికరంగానే ఉన్నప్పటికి ఇది అక్షర సత్యం. ఇటీవల బొమ్మూరు మురళీకొండపై వరుసగా నాలుగిళ్లను దోచేసిన సంఘటన మరువక ముందే నల్లజర్ల మండలం అచ్చన్నపాలెంలో మరో భారీ చోరీ జరిగింది. సోమవారం రాత్రి 48 కాసుల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదు గుర్తుతెలియని వ్యక్తులు దోచుకుపోయారు. గత నెలలో ఒకే రోజు కొవ్వూరు, రాజమహేంద్రవరంలో చైన్ స్నాచింగ్‌లు జరిగాయి.సైబర్ నేరాలు పెరిగిపోయాయి.

7.45 గంటలకే చైన్ స్నాచింగ్

రాజమహేంద్రవరం గోదావరి బండ్ రోడ్డు పెట్రోల్ బంకు పక్కనే ఉన్న వీధిలో రాత్రి 7-45 గంటలకు ఒక మహిళ నడచి వెళుతుండగా గుర్తుతెలియనివ్యక్తి బైక్‌పై వచ్చి ఆమె మెడలోంచి 40 గ్రాముల బంగారు ఆభరణాలు లాక్కుని పారిపోయాడు. ఈ సంఘటనతో రాజమహేంద్రవరంలో మహిళలు ఉలిక్కిపడ్డారు. ఒక పక్క ఇస్కాన్ టెంపుల్ ఉండడంతో రద్దీగానే ఉంటుంది. మరో పక్క వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఉంటుంది. అయినా ఏ మాత్రం బెదురు లేకుండా ఒకే వ్యక్తి బైక్‌పై వచ్చి బంగారు గొలుసు ఎలా లాక్కునిపోయాడో అర్థం కావడం లేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గోదావరి బండ్ రోడ్డు రాత్రి 10 గంటల వరకూ రద్దీగానే ఉంటుంది. అటువంటిది 7:45 గంటలకే చైన్‌స్నాచింగ్ జరగడంతో మహిళలు భయపడుతున్నారు.



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి

ప్రణవస్వరూపా... నరసింహా

వైభవంగా ప్రారంభమైన అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు

తొలిరోజు ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై స్వామివారికి గ్రామోత్సవం

అంతర్వేది, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): శ్రీకర శుభకర ప్రణవస్వరూపుడైన ఆదిదేవుడు శ్రీలక్ష్మీనరసింహస్వామివారిని పెండ్లి కొడుకుగాను, అమ్మవారిని పెండ్లి కుమార్తెగాను తీర్చిదిద్దే అపూర్వ ఘట్టానికి మంగళవారం అంతర్వేది ఆలయం వేదికైంది. ఆచారం ప్రకారం కేశవదాసుపాలెం గ్రామానికి చెందిన బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబాల సంయుక్త నిర్వహణలో సాయంత్రం 6.30గంటలకు ధూపసేవ అనంతరం ముద్రికాలంకరణ నిర్వహించారు. విశేష పూజలందుకున్న స్వామి-అమ్మవార్లను అర్చకులు పెళ్లికి సిద్ధం చేశారు. అర్చకుల వేదమంత్రోచ్ఛారణల నడుమ నీలమేఘశ్యాముడైన స్వామివారికి బుగ్గన చుక్క పెట్టడంతో పెండ్లి కొడుకుగా దర్శనమిచ్చారు. వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి-అమ్మవార్లకు బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబీకులు ఉంగరాలను సమర్పించారు.



స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తె చేస్తున్న అర్చకస్వాములు

ఎన్నో ఏళ్లగా వంశపారంపర్యంగా రెండు కుటుంబాల సంయుక్త నిర్వహణలో భక్తుల కోలాహలం నడుమ స్వామివారిని పెండ్లి కొడుకు చేస్తున్నారు. ఉభయ కుటుంబాలకు చెందిన ఆడపడుచులు స్వామి, అమ్మవార్లకు హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉండపల్లి, బెల్లంకొండ కుటుంబీకులచే అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ, ఆలయ ఫ్యామిలీ ఫౌండర్, చైర్మన్ రాజా కలిదిండి కుమారరామగోపాలరాజా బహదూర్, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, ఆకన బాబ్జీనాయుడు, వనమాలి మూలాస్వామి, పోతురాజు కృష్ణ, పిండి సత్యనారాయణ, వలవల రాంబాబు, రావూరి నాగు, ఉండపల్లి అంజి, బైరా నాగరాజు, పొన్నాల ప్రభ, బెల్లంకొండ, ముప్పర్తి కుటుంబ సభ్యులు, కొపనాతి కృష్ణమ్మ కుటుంబ సభ్యులు, వాహనకారులు పాల్గొన్నారు.

ఆర్తజన రక్షకుడు అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు సూర్యభగవానుడి జన్మదినమైన రథసప్తమి రోజున వైభవంగా ప్రారంభమయ్యాయి. వార్షికంగా బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబీకులు తొలి పూజలు చేశారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. ఆలయ స్థానాచార్యుడు వింజమూరి రామరంగాచార్యులు సమక్షంలో ప్రధానార్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శ్రీవారికి వైఖానస ఆగమానుసారం వైష్ణవ సంప్రదాయం ప్రకారం పూజలు జరిగాయి. ఉదయం సుప్రభాత సేవ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. తిరువారాధన, బాలభోగం, పంచామృత అభిషేకాలు జరిగాయి.



రాజావారి వీధికి రథాన్ని లాగుతున్న భక్తులు



కొబ్బరికాయ కొట్టి రథాన్ని ముందుకు కదిలిస్తున్న చైర్మన్, అధికారులు, వాహనకారులు



ముద్రికాలంకరణలో స్వామి, అమ్మవార్లు

రథ సప్తమిని పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు సముద్ర స్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాకార మండపంలో ఉదయం అధిక సంఖ్యలో మహిళలు సూర్య నమస్కారాలు చేశారు. క్యూలైన్లలో భక్తులకు ఉత్సవ సేవకులు, పోలీసులు సేవలు అందిస్తున్నారు.

ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ నిలువెత్తు విగ్రహానికి ఆలయ చైర్మన్, అధికారులు, ఉత్సవ సేవా కమిటీ, అగ్నికుల క్షత్రియులు పూలమాలలు వేశారు. అనంతరం శ్రీస్వామివారి రథానికి పూజలు చేశారు. గంటలు మోగగా భక్తులు గోవింద నామస్మరణతో రథాన్ని లాగి ఉత్సవాలను ప్రారంభించారు. పల్లిపాలెం గ్రామానికి చెందిన వాహనకారులు, గ్రామస్తులు, భక్తులు రథాన్ని మెరక వీధి (రాజా వారి వీధి)కి చేర్చారు.



కొపనాతి కృష్ణమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆలయ సహాయ కమిషనరు సత్యనారాయణ

కల్యాణోత్సవాల్లో భాగంగా తొలిరోజు ఉదయం శ్రీలక్ష్మీనరసింహుడు శృంగవరప్పాడు వాస్తవ్యులు అడబాల వెంకన్నవారి కుమారులతో నిర్మితమైన సూర్య ప్రభ వాహనంపై పుర వీధుల్లో విహరించగా భక్తులు హారతులు ఇచ్చారు.

రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. కేశవదాసుపాలెం వాస్తవ్యులు బెల్లంకొండ, ఉండపల్లి, మోరిపోడు వాస్తవ్యులు ముప్పర్తి సుబ్బారావు కుటుంబ సభ్యులచే నిర్మితమైన చంద్రప్రభ వాహనంపై స్వామివారు నృసింహ నామచరణాలు, మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగారు. స్వామివారికి భక్తులు హారతులు ఇచ్చి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు.

రథ సప్తమి వేడుకలు

● ఆలయాల్లో ప్రత్యేక పూజలు ● పోటెత్తిన భక్తులు



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సూర్యప్రభ వాహనంపై స్వామివారు



సామర్ల కోట భీమేశ్వరాలయంలో విశేష పూజల అనంతరం సూర్య నారాయణ స్వామి





సర్పవరం భావనారాయణస్వామి ఆలయంలో పాల పొంగలి తయారుచేస్తున్న మహిళలు, స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

భావనారాయణస్వామి ఆలయంలో...

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోన్న కాకినాడ జిల్లా సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం రథ సప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. మాఘ మాసోత్సవాల్లో భాగంగా తిరునాళ్లను పురస్కరించుకుని స్వామివారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. అత్యంత భక్తి శ్రద్ధలతో ముక్తికా సరస్సులో పుణ్యస్నానాలాచరించారు. ముందుగా భావనారాయణస్వామిని దర్శించుకున్న తర్వాత ఈశాన్య దిక్కున ఉన్న లక్ష్మీదేవి, ఆగ్నేయంలో ఆదిశేష భావనారాయణస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో సూర్యభగవానుడికి ఎంతో ప్రీతిపాత్రమైన పాల పొంగులను ఆవు పిడకల పొయ్యిలపై తయారు చేసి భక్తితో స్వామివారికి పాల పొంగలి, మొలకెత్తిన పెసలు, రేగుపళ్లు, చెరకు ముక్కలు, అరటి పండ్లను నివేదిస్తూ ఆకాశంలోకి ఎగురవేశారు. వీటిని భక్తులు కొంగులతో ఒడిసిపట్టుకుని ప్రసాదాన్ని స్వీకరించారు. మాఘమాసంలో రథసప్తమి పర్వదినాన సూర్యభగవానుడిని పూజించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటూ ఏడు జన్మల పాపాలు తొలగిపోతాయని, కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ఉత్సవ కమిటీ చైర్మన్ పుల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు ఆదేశాల మేరకు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

వాడపల్లి వెంకన్న ఆలయంలో...

ఆత్రేయపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు ఫణిశర్మ ఆధ్వర్యంలో సూర్యనమస్కారాలు నిర్వహించారు. అనంతరం సూర్యప్రభ వాహనంపై అలంకృతుడైన శ్రీవారు తిరుమాడవీధులలో విహరించి భక్తులకు అభయహస్తం అందించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తజన గోవిందనామస్మరణతో స్వామివారి వాహన సేవ ఘనంగా నిర్వహించారు. ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్య చక్రధరరావు పాల్గొన్నారు. అశేష భక్తజనం రథసప్తమి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే వివిధ గ్రామాల్లో ఇళ్ల వద్ద మహిళలు రథసప్తమి వేడుకలను నిర్వహించారు. చెరుకుముక్కతో పర్వాన్నం వండి చిక్కుడుకాయతో రథం చేసి వేడుకలు నిర్వహించుకున్నారు.

సామర్లకోట భీమేశ్వరాలయంలో...

సామర్లకోట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా కాకినాడ జిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలోని సూర్యనారాయణస్వామి ఉపాలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, కొంతేటి భీమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకటరమణల వేదమంత్రోచ్ఛారణల మధ్య స్వామివాని పంచద్రవాలతో అభిషేకించారు. పుష్పార్చన పూజలు చేసి నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ముందుగా సూర్యనమస్కారములు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు.

సమస్యలు పరిష్కరించండి

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ వినతి



విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఫెడరేషన్ సభ్యులు

ఉండ్రాజవరం/అనపర్తి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పౌల్ట్రీ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని వినతిపత్రం అందజేసినట్టు ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం కాల్ధరి గ్రామానికి చెందిన పౌల్ట్రీ యజమాని కోమట్లపల్లి వెంకటసుబ్బారావు మంగళవారం రాత్రి విలేకర్లకు తెలిపారు. ముఖ్యమంత్రిని ఫెడరేషన్ కమిటీ సభ్యులు మంగళవారం విజయవాడలో కలసి వారి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ సంక్షోభంలో ఉన్న పౌల్ట్రీ పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలని, గతంలో వలే రైతులకు చేయూత అందించాలని కోరినట్టు చెప్పారు. అలాగే జొన్న ఇంపోర్టు డ్యూటీని తగ్గించాలని, బ్యాంకులోన్‌కు సంబంధించి వడ్డీ రిబేటు కల్పించాలని ముఖ్యమంత్రిని కోరామని, సమస్యలను పరిష్కరించడానికి చంద్రబాబు సానుకూలంగా స్పందించారని చెప్పారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు టి.కుటుంబరావు, జాయింట్ సెక్రటరీ పడాల సుబ్బారెడ్డి, కమిటీ సభ్యులు గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం, జి.గంగాధరరావు, పౌల్ట్రీ యజమానులు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

పిఠాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ బాల బాలికల జట్ల ఎంపిక ఈ నెల 6వ తేదీన ఉదయం 9 గంటల నుంచి కోనసీమ జిల్లా రామచంద్రపురంలో జరుగుతుందని ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు. 2009 జనవరి 1వ తేదీ తర్వాత పుట్టిన వారు మాత్రమే ఎంపికలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఎంపికకు వచ్చే క్రీడాకారులు ఒరిజనల్ ఆధార్, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రాలు తీసుకురావాలని సూచించారు. ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకూ పిఠాపురంలో జరిగే రాష్ట్ర యూత్ బాస్కెట్‌బాల్ బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.



112 ఏళ్లుగా... అదే రథం!

మండపేటలో ఈనెల 8న ఊరేగింపునకు సిద్ధం

మండపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఏడాది కోసారి మాఘమాసంలో జరిగే శ్రీదేవిభూదేవిసమేత భోగ జనార్దనస్వామివారి కల్యాణ వేడుకలకు కోనసీమ జిల్లా మండపేటలో 112 ఏళ్ల పూర్తిచేసుకున్న పురాతన రథాన్ని సిద్ధం చేశారు. 500 ఏళ్ల చరిత్ర కలిగిన మండపేట జనార్దనస్వామికి ఏటా మాఘమాసంలో కల్యాణం జరగడం తరతరాల నుంచి అనవాయితీగా వస్తోంది. ఉత్సవానికి ఆలమూరు మండలం మడికికి చెందిన శిల్పి తణుకు పుర షోత్తం 1913 ఫిబ్రవరి 17న తయారు చేసిన రథం నేటికీ చెక్కు చెదరకుండా దృఢంగా ఉంది. 32 అడుగుల ఎత్తు, 13 అడుగుల వెడల్పుతో నిర్మించిన ఈ రథం స్వామివారి రథోత్సవానికి ఏడాదికోసారి మాత్రమే వినియోగిస్తారు. మండపేటలో ఈనెల 8న నిర్వహించే జనార్దనస్వామి రథోత్సవానికి దీన్ని ముస్తాబు చేస్తున్నారు. రథాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్డులో ఉంచుతారు. స్వామివారి ఊరేగింపు రథం గుడి నుంచి ప్రారంభమై కలువపువ్వుసెంటరు వర కు సాగుతుంది. ఊరేగింపులో భారీసంఖ్యలో భక్తులు పాల్గొంటారు. రథం లాగేతాళ్లను తాళ్లరేవులో తయారుచేయించారు. అవి కూడా నేటికి చెక్కు చెదరలేదు.



మండపేటలో రథం... రథంపై శిల్పి పేరు, తయారు చేసిన తేదీ దృశ్యాలు

నేటి నుంచి తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో అపర్ణా కళా తోరణం బత్తుల మురళీకృష్ణ కళా వేదికపై మార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో 18వ ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీలు బుధవారం రాత్రి నుంచి ప్రారంభం కానున్నాయి. 9వ తేదీ వరకూ జరిగే నాటికల పోటీలకు ఉభయ తెలుగురాష్ట్రాలు నుంచి వివిధ నాటక సమాజాల కళాకారులు వచ్చి నాటికలు ప్రదర్శిస్తారని కళాపరిషత్ అధ్యక్షుడు పడాల రవి తెలిపారు. ఫిబ్రవరి 5వ తేదీ రాత్రి గుంటూరు అమరావతి ఆర్ట్స్ కళాకారులు చిగురు మేఘం నాటికను, విశాఖపట్టణం తెలుగుకళాసమితి కళాకారులు నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటికను, 6వ తేదీన గుంటూరు జిల్లా తాడేపల్లి అరవిందా ఆర్ట్స్ కళాకారులు విడాకులు కావాలి, కొలకలూరు సాయి ఆర్ట్స్ కళాకారులు జనరల్ భోగీలు, 7వ తేదీన హైదరాబాదు గోవాడ క్రియేషన్స్ కళాకారులు మూల్యం నాటిక, కత్రపాడు ఉషోదయ నికేతన్ కళాకారులు కిడ్నాప్ నాటిక, 9న పొన్నూరు రసఝురి కళాకారులు గురి తప్పిన వేట నాటికను ప్రదర్శిస్తారు. రాత్రి పోటీలు ముగిసిన అనంతరం బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని, 8న పోటీలకు విరామం ఉంటుందని పేర్కొన్నారు.

ఉత్సాహంగా అండర్ 16 టెన్నిస్ పోటీలు

కాకినాడ అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో అండర్ 16 ఆలిండియా ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు మంగళవారం రెండో రోజు ఉత్సాహంగా సాగాయి. బాలుర సింగిల్స్ విభాగంలో కార్తీక్(ఏపీ)పై ధుర్వ్ (తమిళనాడు) 6-0, 6-0, విజేత్ (తెలంగాణ)పై తనీష్(తెలంగాణ)6-4, 6-1, ప్రతీక్(ఏపీ)పై ఎస్‌వీ.సూర్య (ఏపీ)6-3,6-7, 6-3, హర్ష (ఏపీ)పై భవేష్(తెలంగాణ)6-0,6-0 స్కోరుతో... బాలికల విభాగంలో చార్విక్లీ(ఏపీ)పై జోషిత (ఏపీ) 6-4, 6-0, రెబ్క(తెలంగాణ)పై జానకి(ఏపీ) 6-4,6-1,లలిత(ఏపీ)పై గౌరిశ్రీ(తెలంగాణ) 6-1,6-0, తేజశ్రీ(ఏపీ)పై లేఖ్య(ఏపీ) 6-1,6-1 స్కోరుతో గెలుపొందారు. లాన్ టెన్నిస్ సంఘ రాష్ట్ర కార్యదర్శి, చీఫ్ రిఫరీ శివకుమార్ పర్యవేక్షించారు.

దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు.. దగ్ధం


దివాన్‌చెరువులోని బ్రిడ్జి కౌంటీ వెనుక భాగంలో ఉన్న రిజర్వు ఫారెస్టులో దట్టమైన పొగలతో ఎగసిపడుతున్న మంటలు

- 5 హెక్టార్లకు వ్యాపించిన మంటలు
- మంటలను అదుపు చేసిన అటవీ, అగ్నిమాపక సిబ్బంది

రాజానగరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టులో మంగళవారం మంటలు వ్యాపించాయి. జాతీయ రహదారిని ఆనుకుని బ్రిడ్జి కౌంటీ వెనుక ప్రాంతంలోని ఈస్ట్ రిజర్వు ఫారెస్టులో దట్టమైన పొగలతో కూడిన మంటలు ఎగసిపడుతుండడంతో పరిసర గ్రామాల ప్రజలు, జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు ఆందోళనకు గురయ్యారు. ఫారెస్టులోని జామాయిల్ చెట్లలో ఐదు హెక్టార్ల విస్తీర్ణంలో నేలరాలిన ఆకులు, అలమలతోపాటు పొదలు మంటల్లో కాలిబూడిదయ్యాయి. దీన్ని గ్రౌండ్ ఫైర్ అంటారని, చెట్లకు ఏ నష్టం వాటిల్లలేదని అటవీ, అగ్నిమాపక అధికారులు వెల్లడించారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో అగ్నిప్రమాదం జరిగి రిజర్వు ఫారెస్టు దగ్ధమైంది. అటవీ, అగ్నిమాపక అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక యంత్రాలు ఫారెస్టులోకి ప్రవేశించేందుకు వీలులేకపోవడంతో బ్లోయర్ల సహాయంతో మంటలను అదుపు చేశారు. పరిసర ప్రాంతాల్లోని వారు కాల్చిపడేసిన, సిగరెట్, బీడీ, చుట్టలవల్ల అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని అగ్నిమాపకశాఖ జిల్లా అధికారి మార్టిన్ లూథర్ కింగ్, అసిస్టెంట్ ఫైర్‌ఆఫీసర్ శ్రీనివాస్ సందర్శించారు.

పరిశీలించిన మంత్రి దుర్గేష్

దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్ట్‌లో జరిగిన అగ్నిప్రమాదాన్ని అధికారుల చొరవతో చాలా వరకు అదుపు చేయగలిగామని రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. అగ్నిప్రమాద ప్రాంతాన్ని మంగళవారం ఆయన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ అగ్నిప్రమాదం మానవ ప్రమేయంతోనే జరిగినట్లుగా భావిస్తున్నామన్నారు. అగ్నిమాపక సిబ్బంది త్వరతగతిన వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారన్నారు. సకాలంలో స్పందించడంవల్ల వృక్షాలను కాపాడగలిగామన్నారు.


అగ్నిప్రమాద ప్రాంతాన్ని రాజానగరం ఎమ్మెల్యే బత్తులతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

న్యూడ్ ఫొటోలు నెట్‌లో పెడతానని బెదిరించిన వ్యక్తి అరెస్టు


నిందితుడు నినావతి దేవనాయక్ అలియాస్ మధుసాయికుమార్

- దఫదఫాలుగా రూ.2.53 కోట్లు కొట్టేసిన స్నేహితురాలి భర్త
- బాధిత యువతి ఫిర్యాదుతో నిడదవోలు పోలీస్‌స్టేషన్‌లో కేసు
- గుంటూరు జిల్లా పెదకాకానిలో నిందితుడి అరెస్టు
- రూ.1.81కోట్ల విలువైన ఆస్తులు సీజ్
- లభ్యం కాని న్యూడ్ వీడియోలు
- ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరిన పోలీసులు

కొవ్వూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆ తల్లి దండ్రులకు ఒక్క కుమార్తె కావడంతో గారాబంగా పెంచారు. సాఫ్ట్‌వేర్ కొలువు రావడంతో హైదరాబాద్ వెళ్లింది. అక్కడ ఆమె స్నేహితురాలు భర్తగా పరిచయమైన యువకుడు ఆ యువతి జీవితాన్ని అగాధంలోకి నెట్టివేశాడు. నాలుగేళ్లుగా వేధిస్తూ ఆ కుటుంబాన్ని అప్పుల్లోకి నెట్టేశాడు. కొవ్వూరు డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం డీఎస్పీ జి.దేవకుమార్ విలేకరులకు వివరాలు వెల్లడించారు.


సీజ్ చేసిన బంగారు ఆభరణాలు, నగదుతో డీఎస్పీ, ఇతర సిబ్బంది

తమిళనాడుకు చెందిన ఒక కుటుంబం 30 ఏళ్ల కిందట నిడదవోలు వచ్చి స్థిరపడింది. తండ్రి నిడదవోలులో వ్యాపారం చేస్తుండగా తల్లి గృహిణిగా ఉన్నారు. వీరి ఒక్కగానొక్క కుమార్తె బీఎస్సీ కంప్యూటర్ సైన్సు చదువుకుని హైదరాబాద్ విప్రో కంపెనీలో నాన్ ఐటీ ఉద్యోగంలో చేరింది. కూకట్‌పల్లిలోని గాయత్రి ఉమెన్స్ హాస్టల్‌లో చేరింది. హాస్టల్‌లో చిన్ననాటి స్నేహితురాలు కాజా అనూషాదేవి కలిసింది. అనూషాదేవి చిన్నతనంలో గుంటూరు నుంచి తన మావయ్య ఇంటికి నిడదవోలు వచ్చేది. అప్పుడు బాధితురాలికి అనూషాదేవితో పరిచయం ఏర్పడింది.. ఆ పరిచయంతో ఇద్దరూ స్నేహంగా ఉండేవారు. అప్పటికే అనూషాదేవి గుంటూరు రూరల్ ప్రాంతానికి చెందిన నినావత్ దేవనాయక్ అలియాస్ మధు సాయికుమార్‌ని ప్రేమించి కులాంతర వివాహం చేసుకుంది. తన భర్తని యువతికి పరిచయం చేసింది. ముగ్గురూ స్నేహంగా ఉండేవారు.

వేరెవరో చేసినట్టుగా నమ్మించి..

కాగా, 2021లో బాధిత యువతి ఉద్యోగం మానివేసి నిడదవోలులోని ఇంటికి వచ్చేసింది. ఆ సమయంలో సాయికుమార్ వేరెవరో ఫోన్ చేసినట్టు బాధితురాలికి ఫోన్ చేశాడు. హాస్టల్‌లో ఉన్నప్పుడు తీసిన న్యూడ్ వీడియోస్ తనవద్ద ఉన్నాయని.. అవి నెట్‌లో పెట్టకుండా ఉండాలంటే కొంత డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ విషయాన్ని యువతి స్నేహితుడిగా నమ్మిన సాయికుమార్‌కి చెప్పడంతోన్యూడ్ వీడియోల గొడవను వేరొకరితో సెటిల్‌మెంటు చేసినట్టు నమ్మించాడు. ఆ గొడవలో దెబ్బలు తగిలాయని ఆస్పత్రి బిల్లుకు కొంత డబ్బులు కావాలని అడిగి తీసుకున్నాడు. గుంటూరులో బాయ్స్ హాస్టల్‌పెట్టి మేనేజ్‌మెంటు చేస్తున్నట్టు కొంత డబ్బు తీసుకున్నాడు. ఇలా అవసరం వచ్చినప్పుడల్లా డబ్బులు డిమాండ్ చేసేవాడు. ఇవ్వకపోతే న్యూడ్ వీడియోలు తన వద్ద ఉన్నాయని వాటిని నెట్‌లో పెడతానని బెదిరించేవాడు. దీంతో బాధిత యువతి తన తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వారూ బెదిరిపోయారు. పెళ్లికావాల్సిన అమ్మాయి జీవితం పాడవుతుందని తమవద్దఉన్న డబ్బుతోపాటు ఇల్లు తాకట్టు పెట్టి, తెలిసిన వారి వద్ద కొంత అప్పు చేసి 2021 నుంచి 2025 వరకు రూ.2,53,76,000 ఆన్‌లైన్ ద్వారానే దఫదఫాలుగా సాయికుమార్‌కి పంపారు.

బెదిరింపులు తాళలేక ఫిర్యాదు

ప్రస్తుతం యువతి తల్లిదండ్రులు అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. యువతిని బెదిరించి తీసుకున్న డబ్బుతో సాయికుమార్ విలాసవంతమైన జీవితం గడుపుతున్నాడు. అతడి తల్లిదండ్రులు గుంటూరు మిర్చియార్డులో డైలీ లేబర్ పనిచేసుకుంటున్నారు. ఈ ఏడాది జనవరిలో మరో రూ.14లక్షలు కావాలని డిమాండ్ చేశాడు. అప్పటికే అప్పులు పాలవ్వడంతో ఇవ్వలేకపోయారు. చివరకు చేసేదేంలేక బెదిరింపులకు పాల్పడుతున్న సాయికుమార్‌పై ఫిబ్రవరి 1న నిడదవోలు పోలీస్‌స్టేషన్‌లో యువతి ఫిర్యాదు చేసింది. నిడదవోలు ఎస్‌ఐ జి.ఎస్.ఆర్.కె పరమహంస నిందితుడు సాయికుమార్‌పై చీటింగ్ కేసు(ఎక్స్‌టార్షన్) భయపెట్టి డబ్బులు తీసుకోవడం(ఐటీ యాక్టు) న్యూడ్ ఫొటోలు, వీడియోలు ఉన్నాయని బెదిరించడంపై కేసు నమోదు చేశారు. ఐటీ యాక్టు ఉండడంతో నిడదవోలు సీఐ పి.వి.జి.తిలక్ కేసు దర్యాప్తు ప్రారంభించారు. యువతి ఇచ్చిన ఆధారాలతో గుంటూరు జిల్లా చిన్నకాకాని చేరుకుని ఈనెల 2న సాయికుమార్‌ని అరెస్టు చేశారు. అతడివద్దనుంచి రూ.75లక్షలనగదు, 938 గ్రాముల బంగారు అభరణాలు, 2.250కిలోల వెండి వస్తువులు, కారు, బుల్లెట్, చిన్నకాకానీలో రూ.40లక్షలతో కొనుగోలు చేసిన అపార్ట్‌మెంటు పత్రాలను తహశీల్దార్, రెవెన్యూ అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ.1,81,45,000 ఉంటుందన్నారు. సాయికుమార్‌ని ఈనెల 3న కోర్టులో హాజరుపర్చగా జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్‌జైలుకు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో పూర్తిస్థాయి విచారణ చేపట్టాల్సి ఉండడంతో సాయికుమార్‌ని ఐదు రోజులు పోలీసు కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరామన్నారు. ఈకేసులో ఎటువంటి వీడియోలు లభ్యం కాలేదని తెలిపారు.అయినా ఉన్నాయని బెదిరించి, డబ్బులు వసూలు చేసినట్టు చెప్పారు. అతడి ఫోన్, నెట్‌ను పరిశీలించగా ఎటువంటి వీడియోలు లభించలేదన్నారు. బాధిత యువతి స్నేహితురాలు అనూషాదేవి పాత్రపై ఎటు వంటి ఆధారాలు దొరకలేదన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్‌చేసినా, వేధింపులకు గురిచేసినా పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో కొవ్వూరు, నిడదవోలు సీఐలు పి.విశ్వం, పి.వి.జి.తిలక్, నిడదవోలు, పెరవలి, కొవ్వూరు ఎస్‌ఐలు జి.ఎస్.ఆర్.కె పరమహంస, ఎం.వెంకటేశ్వరరావు,కె.జగన్మోహనరావు పాల్గొన్నారు.

పార్క్ చేసిన బైక్ నుంచి రూ.1.50లక్షలు చోరీ

- అమలాపురం రూరల్‌లో ఘటన

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అమలాపురం మండలం పేరూరు వై.జంక్షన్ సమీపంలో మంగళవారం పార్కింగ్ చేసిన మోటారుసైకిల్ నుంచి ఇద్దరు యువకులు రూ.1.50లక్షల నగదును అపహరించుకుని పరారయ్యారు. స్థానికులు, పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరుకు చెందిన సత్యనారాయణరెడ్డి ఫైనాన్స్ వ్యాపారంలో భాగంగా అమలాపురం వచ్చారు. వసూళ్లు చేసుకుంటూ పేరూరు వై.జంక్షన్ సమీపంలో అల్పాహారం స్వీకరించేందుకు మోటారుసైకిల్‌ను పార్కింగ్ చేసి హోటల్‌కు వెళ్లారు. ఇంతలో ఇద్దరు యువకులు మోటారుసైకిల్‌పై వచ్చి సత్యనారాయణరెడ్డి మోటారుసైకిల్ డిక్కీలో ఉన్న రూ.1.50 లక్షల నగదును అపహరించుకుని పరారయ్యారు. సమీపంలోని పెట్రోలు బంకు వద్ద సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ వారిని గుర్తించే పరిస్థితి కనిపించలేదు. ఆ యువకులు మోటారుసైకిల్‌పై జాతీయ రహదారిపై రేళ్లపాలెం వైపు వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. సత్యనారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వీరబాబు తెలిపారు.

కత్తిపూడిలో చోరీ

- మూడు తులాల బంగారం, రూ.50వేల నగదు అపహరణ

శంఖవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడిలోని యాదవపేటలో ఓఇంట్లోకి మంగళవారం దొంగలు చొరబడి నగదు, బంగారం అపహరించుకుపోయారు. గ్రామానికి చెందిన వీరవల్లి కామేశ్వరరావు కుటుంబం ఇంటికి తాళం వేసి ఆదివారంరాత్రి బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం వచ్చి చూసేసరికి ఇల్లంతా చిందరవందరగా ఉందని బాధితులు తెలిపారు. లోపలికి వెళ్లి చూస్తే ఇంట్లోని మూడుతులాల బంగారం, రూ.50వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించామన్నారు. దీనిపై అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ శ్రీహరిబాబు వచ్చి సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

లలితేశ్వరి హత్యకేసులో మరో నిందితురాలి అరెస్టు

బిక్కవోలు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పందలపాకలో గతనెల 29న కురుపూడి లలితేశ్వరి అనే వివాహితను కేబుల్ వైరును మెడకు బిగించి అతికిరాతకంగా హత్య చేసిన కేసులో ఏ2 గుంతికోలు వరలక్ష్మిని మంగళవారం బిక్కవోలులో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు అనపర్తి సీఐ సుమంత్ తెలిపారు. ఈ కేసులో ముందుగా వరలక్ష్మి కుమారుడు దుర్గాప్రసాద్‌ను గతనెల 30న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ కేసులో కొందరు నిందితులు లలితేశ్వరిని హత్య చేయడంలో సహకరించారని గ్రామంలోని మహిళలు, కుటుంబసభ్యులు ఈనెల 1న ఆందోళన చేపట్టారు. దీంతో సీఐ విచారణ చేపట్టగా లలితేశ్వరి హత్యకేసులో వరలక్ష్మి పాత్ర కూడా ఉందని తేలడంతో ఆమెను అరెస్టు చేశారు.

నిందితులు పాత నేరస్తులే


స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలతో ఎస్పీ కృష్ణారావు, అడ్మిన్ ఎస్పీ ప్రసాద్

- వేలిముద్రల ద్వారా గుర్తింపు
- రాజోలు దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు
- పది రోజుల్లోనే ఇద్దరి అరెస్టు
- రూ.40లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం

అమలాపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పదిరోజుల వ్యవధిలోనే భారీ దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. రూ.40లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాజోలులో గతనెల 24న జరిగిన భారీ దోపిడీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారినుంచి రూ.40లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు మంగళవారం మధ్యాహ్నం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. కేసుకు సంబంధించి వివరాలను వెల్లడించారు.

వేలిముద్రల ద్వారా గుర్తింపు

రాజోలులోని సత్తిరాజువారివీధిలో నివాసం ఉంటున్న విశ్రాంత తెలుగు పండిట్ గెల్లి బాపన్నగుప్తా కుటుంబసభ్యులతో కలిసి గతనెల చివరి వారంలో అన్నవరం వెళ్లారు. అక్కడ ఓంశాంతి సమావేశాల్లో పాల్గొనేందుకు కుటుంబ సభ్యులతో వెళ్లిన సత్తిరాజు గతనెల 24న తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపుల తాళాలు పగులకొట్టి 65 నవర్ల బంగారు ఆభరణాలు, ఆరు కిలోల వెండి వస్తువులను అపహరించుకుపోయారు. ఈ ఘటనపై సత్తిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజోలు పోలీసులు గతనెల 25న కేసు నమోదు చేసి రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు. ఆ సమయంలో క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్, క్రైం పార్టీ సిబ్బంది ఘటనా స్థలాన్ని సందర్శించి వేలిముద్రలు సేకరించారు. వేలిముద్రలతో పాత నేరస్తుల క్రైం సస్పెక్ట్ షీట్ల ఆధారంగా పాత నేరస్తులే ఈ దోపిడీకి పాల్పడ్డట్టు గుర్తించామని ఎస్పీ కృష్ణారావు వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం హౌసింగ్‌బోర్డు కాలనీ ప్రకాష్‌నగర్‌కు చెందిన గుబ్బల భాస్కర్, అతనికి సహకరించిన నర్సాపురానికి చెందిన కొత్తపల్లి నరేష్‌లను నేరస్తులుగా గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా రాజోలులో జరిగిన నేరాన్ని అంగీకరించినట్టు చెప్పారు. వీటితోపాటు నర్సాపురం పట్టణం, పెనుమంట్ర, పాలకొల్లు టౌన్, పాలకోడేరు, రాజమహేంద్రవరం, అమలాపురం, రావులపాలెం, రాజోలు స్టేషన్ పరిధిలో వీరు 25కు పైగా ఆస్తి నేరాలకు పాల్పడిన గత చరిత్ర కలిగి ఉన్నారని చెప్పారు. నిందితులు అంగీకరించిన మేరకు నర్సాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామం నక్కావారిపేటలోని కాసువారి నాస్ గార్డెన్‌లో చోరీ సొత్తు అయిన బంగారు, వెండి వస్తువులను ఉంచినట్టు గుర్తించిన పోలీసులు వాటిని మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. విలువైన బంగారం వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.40లక్షల వరకు ఉంటుందని ఎస్పీ విలేఖరులకు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు. కాగా ఈ కేసును తక్కువ రోజుల్లో అత్యంత చాకచక్యంగా ఛేదించిన రాజోలు పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ కృష్ణారావు అభినందించారు. కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్ కేసును ఛేధించిన సీఐ టీవీ నరేష్‌కుమార్, రాజోలు ఎస్‌ఐ వి.రాజేష్‌కుమార్, హెచ్‌సీలు పి.రామ్‌కిశోర్, కె.వెంకటరమణ, పీసీలు పి.కుమార్, బీఎన్‌వీఎస్ రెడ్డి, క్లూస్‌టీమ్ సభ్యులను ఎస్పీ అభినందించి వారికి రివార్డులు అందజేశారు. విలేఖరుల సమావేశంలో అడ్మిన్ ఎస్పీ ప్రసాద్, డీఎస్పీ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కళల పరిరక్షణకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

- టీఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్పనాయక్

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గిరిజన కళల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్(టీఎస్ఎఫ్) జాతీయ అధ్యక్షుడు కె.అక్కులప్పనాయక్ అన్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడారు. గిరిజన సాంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు దేశానికే గర్వకారణమని, ముఖ్యంగా థింసా నృత్యం ప్రత్యేకమైనదని అన్నారు. గిరిజన, ఆదివాసీ విద్యార్థులు సంప్రదాయ కలలు ఆచార వ్యవహారాలను కొనసాగించాలని కోరారు. ప్రతిఏటా జాతీయస్థాయి ఆదివాసీల సాంస్కృతిక మహోత్సవాలు తాము నిర్వహిస్తూ ఉంటామన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో రెండోసారి వీటిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే పదో సదస్సులో పలువురు ప్రముఖులు పాల్గొంటున్నారన్నారు.

పిచ్చికుక్క దాడి

16మందికి గాయాలు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగరపంచాయతీ గంటావారివీధి, హైస్కూల్ పక్కనున్న వీధుల్లో ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసి దొరికినవారిని దొరికినట్టు గాయపరిచింది. సోమవారం 13మంది, మంగళవారం మరో ముగ్గురు పిచ్చికుక్క దాడిలో గాయపడ్డారు.కొందరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లగా మరికొందరు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. స్థానికులు దాన్ని హతమార్చారు.

ప్రకృతి వ్యవసాయంపై శ్రీలంక దృష్టి

- కాకినాడ జిల్లాలో అక్కడి రైతుల పర్యటన
- క్షేత్రస్థాయిలో పంటల పెంపకం తీరు, మార్కెటింగ్ వంటివి పరిశీలన


గొల్లప్రోలు మండలం దుర్గాడలో పంటలను పరిశీలిస్తున్న శ్రీలంక రైతులు

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఏపీలో ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు నాణ్యమైన దిగుబడులు పొందడంతోపాటు సాగును లాభదాయకంగా చేసుకోవడంపై శ్రీలంక దృష్టిసారించింది. ఇక్కడి సాగు విధానాలను పరిశీలించి అక్కడ అమలు చేయాలని ఆ దేశ వ్యవసాయాధికారులు భావిస్తున్నారు. ఇందులోభాగంగా అక్కడి రైతులు కాకినాడ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు.

శ్రీలంకలోని లంక జాతిక సర్వోదయ శ్రమదాన సంఘమయ(సర్వోదయ ఫౌండేషన్) రైతులకు ప్రకృతి సాగుతోపాటు అధునాతన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడంలో శిక్షణ ఇస్తోంది. శ్రీలంకలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సత్ఫలితాలు సాధించలేకపోయారు. ఈ నేపథ్యంలో ఏపీలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై వారు దృష్టిసారించారు. ఇందుకుగాను రాష్ట్రంలోని కాకినాడ జిల్లాను ఎంపిక చేసుకుని నాలుగురోజుల పర్యటనకు ఆరుగురు రైతులతో కూడిన బృందం ఇక్కడకు వచ్చింది. సోమవారం పెద్దాపురం మండలం జి.రాగంపేటలో జిల్లా రైతుసాధికార సంస్థ ఆధ్వర్యంలో శ్రీలంక రైతులకు శిక్షణఇచ్చారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, మార్కెటింగ్ గురించి వారికి వివరించారు. శిక్షణ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్, ప్రకృతి వ్యవసాయం జిల్లాప్రోగ్రామ్ మేనేజరు ఎలియాజర్, రైతు సాధికార సంస్థప్రతినిధులు హాజరయ్యారు.

క్షేత్రస్థాయిలో...

మంగళవారం శ్రీలంక బృందంలోని ఆరుగురు రైతులు ఫౌండేషన్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ యూనిట్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ థిలమ్ ఎధిరిమన్నా నేతృత్వంలో గొల్లప్రోలు మండలం దుర్గాడ, పిఠాపురం మండలం పి.రాయవరం గ్రామాల్లో పర్యటించారు. దుర్గాడలో ప్రకృతివ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న వివిధ రకాల పంటలు, ఏటీఎం పద్ధతిలో 20 సెంట్ల విస్తీర్ణంలోనే 22 రకాలకు పైగా పంటలు సాగు చేయడం పరిశీలించారు.

ప్రత్తిపాడులోను పర్యటన

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): శ్రీలంక దేశీయులు ప్రత్తిపాడు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయానికి వారు చేరుకుని డ్వాక్రా మహిళలు ప్రకృతి వ్యవసాయ సాగును పరిశీలించారు. మండల ఏపీఎం వెంకట్, మండల సమాఖ్య శ్రీలంక ప్రతినిధులకు వివరించారు. పెద్దిపాలెంలో మహిళా సంఘాల సభ్యులతో కలిసి ప్రకృతి వ్యవసాయ సాగు పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ కార్యాలయానికి చెందిన ప్రీతి, సరోజ, మండల టీం లీడర్ ముకేష్ వర్మ, ఎం.రామరాజు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి మరో నామినేషన్ దాఖలు

ఏలూరు, ఫిబ్రవరి 4: ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరిజిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండో రోజు మంగళవారం రెండో నామినేషన్ దాఖలైంది. ఏలూరుకు చెందిన ములకల శ్రీనివాస్ నామినేషన్ పత్రాలను కలెక్టరేట్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రి సెల్వి సమర్పించారు. ఒకసెట్ నామినేషన్ సమర్పించిన శ్రీనివాస్‌తో రిటర్నింగ్‌అధికారి ప్రమాణం చేయించారు. కలెక్టర్ వెంట ఏఆర్వో, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు ఉన్నారు. తొలిరోజు సోమవారం కాకినాడకు చెందిన పేపకాయల రాజేంద్ర తొలి నామినేషన్ దాఖలుచేయడం తెలిసిందే.

13న రాజమహేంద్రవరానికి రైల్వే జీఎం అరుణ్ రాక

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ ఈనెల 13న రాజమండ్రి రైల్వేస్టేషన్‌కి ప్రత్యేకరైలులో రానున్నారు. ప్రస్తుతం ఖరారైన పర్యటన షెడ్యూల్ ప్రకారం 12న సాయంత్రం నేరుగా కాకినాడ వెళ్లి బస చేస్తారు. 13న ఉదయం బయలుదేరి తనిఖీ చేస్తూ 11గంటల సమయానికి రాజమండ్రి చేరుకుంటారు. భద్రతాపరమైన అంశాలపై దృష్టి సారిస్తారని తెలుస్తోంది. ఆయనతో 40మందితో కూడిన ఉన్నతాధికారుల బృందం రానుంది.

నేడు శ్రీప్రకాశ్‌లో 'హరివిల్లు'

కాకినాడసిటీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 5న కాకినాడ శ్రీప్రకాశ్ సినర్జీ పాఠశాలలోని సీతానరసింహ క్షేత్రం హాలులో హరివిల్లు అనే ఆర్ట్స్, క్రాఫ్ట్స్ కార్యక్రమం విద్యార్థుల తల్లిదండ్రులు,కళాకారుల సమక్షంలో జరగనుంది. దీనికి ముఖ్యఅతిథులుగా జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, గౌరీ వేముల విచ్చేయనున్నారు.

అద్దెకు ఇల్లు చూసేందుకు వచ్చి.. వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఇల్లు అద్దెకు కావాలని వచ్చి ఇంటి యజమాని వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు అపహరించుకుపోయిన సంఘటన రామచంద్రపురం పట్టణంలో గణేష్‌నగర్‌లో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గణేష్‌నగర్‌లో కడియాల పార్వతి తన భర్తతో కలిసి తన ఇంట్లో నివసిస్తోంది. పక్క పోర్షన్ అద్దెకు ఇచ్చేందుకు టులెట్ బోర్డు ఏర్పాటు చేసింది. మంగళవారం ఉదయం ఒక యువకుడు ముఖానికి మాస్క్ పెట్టుకుని ఇల్లు అద్దెకు కావాలని ఇల్లు చూసుకుంటానని పార్వతి వద్దకు వచ్చాడు. తాళం తీయగా అతడు ఇంట్లోకి ప్రవేశించాడు. మొదటి రెండు గదులు చూసి ఆఖరు గది కిచెన్‌లోకి వెళ్లాడు. ఎవరూ లేరని నిర్ధారించుకున్న అగంతకుడు వృద్ధురాలి మెడలోని 4 కాసుల బంగారు గొలుసు లాక్కున్నాడు. పీకపట్టుకుని లాగడంతో వృద్ధురాలు షాక్‌కు గురైంది. అగంతకుడు అక్కడినుంచి పరారయ్యాడు. షాక్ గురైన వృద్ధురాలిని రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. సీఐ ఎం.వెంకటనారాయణ ఆమెను విచారణ జరిపి సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్‌ఐ ఎస్.నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనాస్థలాన్ని డీఎస్పీ బి.రఘువీర్ పరిశీలించారు. బాధితురాలి దగ్గర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీఐ ఎం.వెంకటనారాయణ, ఎస్‌ఐ సత్యనారాయణ ఉన్నారు

'సౌత్‌జోన్ పోటీల్లో నన్నయ ఖ్యాతి చాటాలి'


టాస్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రమశిక్షణతో తమ ప్రతిభను కనబరచాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. అనంతరం జరిగే సౌత్‌జోన్ పోటీల్లో నన్నయ విశ్వవిద్యాలయం ఖ్యాతిని చాటాలని పిలుపునిచ్చారు. నన్నయ విశ్వవిద్యాలయం విద్యకళాశాల ఆధ్వర్యంలో రెండురోజులుపాటు నిర్వహిస్తున్న అంతర్ కళాశాలల హ్యాండ్ బాల్ టోర్నమెంట్, జట్టు ఎంపికలను వీసీ టాస్ వేసి మంగళవారం ప్రారంభించారు. టోర్నమెంట్‌ను నాకౌట్ కం లీగ్ పద్ధతిలో నిర్వహించారు. దీనికి తూర్పుగోదావరి హ్యాండ్‌బాల్ రిఫరీ బోర్డు ఛైర్మన్ పి.దిలీప్‌కుమార్, ఇతర రిఫరీలు పాల్గొన్నారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులు తమిళనాడులోని సేలంలోని పెరియార్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల టోర్నమెంట్‌లో పాల్గొంటారు. విద్యకళాశాల ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు, పరిశీలకుడు వీఎస్ దేవానంద్, ఎంపిక కమిటీ సభ్యులు పి.శ్రీను, సీహెచ్ అంజిబాబు, వ్యాయామ విద్య అధ్యాపకుడు బి.రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశానికి ఎన్నికల కోడ్

కడియం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో మంగళవారం జరిగిన కడియం మండల పరిషత్ సమావేశం కేవలం 10 నిముషాల్లో ముగిసింది. ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీడీవో కె.రమేష్ మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో అభివృద్ధి కార్యక్రమాలపై ఎటువంటి చర్చ చేపట్టడం లేదని సభను ముగించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పంతం గణపతి, సర్పంచ్‌లు అన్నందేవుల చంటి, యాదల స్టాలిన్, కొండపల్లి వట్టియ్య, ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి వెంకటరామారావు, ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ధనిక, పేద అంతరాలు పెంచేలా కేంద్ర బడ్జెట్

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర బడ్జెట్ ధనికవర్గాలు, పేదల మధ్య మరింత అంతరాలను పెంచేలా ఉందని, ఈ బడ్జెట్ కేవలం కార్పొరేట్ వర్గాలకు మాత్రమే అనుకూలంగా ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్రానికి చేకూరే ప్రయోజనం నామమాత్రమేనని స్పష్టం చేశారు. బడ్జెట్‌కు ముందే ఆర్థిక సర్వే వచ్చిందని, జాతీయ అభివృద్ధి తిరోగమనంలో ఉందని ఆ సర్వే స్పష్టం చేసిందన్నారు. ఈ నివేదికను ఏ మాత్రం పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టారని, విద్య వైద్యం, వ్యవసాయ రంగాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. సీఎం చంద్రబాబు కేంద్రానికి తలొగ్గి పోలవరం ఎత్తును తగ్గించేందుకు అంగీకరించడం రాష్ట్రానికి అన్యాయం చేసినట్టేనన్నారు. రాజధాని నిర్మాణానికి కేవలం అప్పుగా మాత్రమే నిధులు సమకూర్చడం వల్ల రాష్ట్ర ప్రజలపై మోయలేని భారం పడుతుందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించడం కోసం సీఎం చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, నగర కార్యదర్శి కొండలరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు చింతలపూడి సునీల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మోటివేషన్ తరగతులు

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రొఫెసర్ బి.నర్సారెడ్డి తెలిపారు. మండలంలోని పిడింగొయ్యి జడ్పీ హైస్కూల్లో సత్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, మోటివేషన్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు చదువు, మార్కులు సాధించడంపై మెలకువలు తెలియజేశారు. 10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పెన్నులు, పరీక్షల ప్యాడ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇంగ్లీష్ ప్రొఫెసర్ ఎస్.శ్రీ నివాస్, హెచ్ఎం సుజాత, సత్య చారిటబుల్ సభ్యులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు వనజ

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానం ప్రకారం రాష్ట్రంలో అర్హత కల్గిన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యురాలు అక్కినేని వనజ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం చెంచుకాలనీ, సింహాచలనగర్, ప్రాంతాల్లో పర్యటించారు. పేదలు ఇచ్చిన ఇంటి స్థలాల అర్జీలను సింహాచలనగర్ సచివాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతున్నామని అన్నారు. గత ఎన్నికల ముందు మాజీ ఎంపీ భరత్‌రామ్ హడావిడిగా ఇళ్ల స్థలాలు ఇచ్చారని, కానీ స్థలం చూపించలేదని, వీరందరికీ కూటమి ప్రభుత్వం స్థలాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, కొండలరావు, సప్ప రమణ, చింతలపూడి సునీల్, టి.నాగేశ్వరరావు, లావణ్య, త్రిమూర్తులు పాల్గొన్నారు.

కుంభమేళాకు బయలుదేరిన మూడు ఆర్టీసీ బస్సులు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్ మహా కుంభ్‌మేళాకు మంగళవారం రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి మూడు సూపర్‌లగ్జరీ బస్సులు బయలుదేరి వెళ్లాయి. ఈ బస్సు సర్వీసులను ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిలా అశోక జెండా ఊపి ప్రారంభించారు. ఒక్కో బస్సులో 36 మంది భక్తులు కుంభ్‌మేళాకు బయలుదేరి వెళ్లారని, యాత్ర పూర్తి చేసుకుని ఈనెల 12వ తేదీన తిరిగి రాజమహేంద్రవరం చేరుకుంటారని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఈ యాత్రలో భక్తులకు భువనేశ్వర్, పూరి, కోణార్క్, గయా, బుద్ధగయ, వారణాసి, అరసవిల్లి క్షేత్రాలు చూపడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ షేక్ షబ్బం, ట్రాఫిక్ సిబ్బంది, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

రామకృష్ణ మిషన్‌లో ఉచిత వైద్యసేవలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామకృష్ణ ధర్మ వైద్యశాలలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఉచిత వైద్య సేవలందిస్తుందని రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞాయానంద ఓ ప్రకటనలో తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు ఉచిత వైద్య సేవలందిస్తామన్నారు. వివరాలకు 0883 2478127 నెంబరులో సంప్రదించాలన్నారు.

ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిని గెలిపించండి

రాజమహేంద్రవరంలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



పట్టభద్రురాలిని ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంగళవారం రాత్రి రాజమహేంద్రవరం 47వ డివిజన్‌లో పరిశీలకులు బత్తుల తాతయ్యబాబు, బీవీ కృష్ణప్రసాద్‌లతో కలిసి ఆయన పట్టభద్రులైన ఓటర్లను కలిసి ఓటు అభ్యర్థించారు. అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సమగ్ర అబివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమౌతుందని రాష్ట్రం వైపు పారిశ్రామికవేత్తలు చూస్తున్నారని ఉద్యోగవకశాలు కల్పించబోతున్నారని చెప్పారు. ప్రచారంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాజసేవలో భాగస్వాములవ్వాలి

సమాజ సేవలో ప్రతిఒక్కరు భాగస్వాములవ్వాలని ఎమ్మెల్యే వాసు పిలుపునిచ్చారు. టీడీపీ పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం రాజమహేంద్రవరంలోని అన్నక్యాంటీన్లలో పేదలకు అన్నదానం నిర్వహించారు. దీని వాసు విచ్చేసి భోజనాలు వడ్డించారు. తొలుత కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, కాశి నవీన్‌కుమార్, వర్రే శ్రీనివాసరావు, నక్కా చిట్టిబాబు, బుడ్డిగ రాధ, ఉప్పులూరి జానకిరామయ్య, మాలే విజయలక్ష్మి పాల్గొన్నారు.

నాకు ప్రాణహాని ఉంది

డీఎస్‌వో రవికుమార్ ఆవేదన

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నా భార్య, ఆమె అక్క వాళ్ల వల్ల తనకు ప్రాణహాని ఉందని రాజమహేంద్రవరం కార్పొరేషన్ జనన-మరణ విభాగం డీఎస్‌వో డి.రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2000 సంవత్సరంలో తనకు వివాహమైందని తెలిపారు. తనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారన్నారు. తన భార్య విలాసవంతమైన జీవితాన్ని వ్యతిరేకించడం వల్ల తనను టార్గెట్ చేసిందని వాపోయారు. సుమారు ఏడాదిన్నర కిందట ముగ్గురు పిల్లలను వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయిందన్నారు. ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినా.. నాలుగు సార్లు పీజీఆర్ఎస్‌లో వినతి పత్రం అందించినా చర్యలు లేవన్నారు. ఇప్పటికైనా తనను చంపాలని చూస్తున్న వారి నుంచి రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు.

'పెద్దిరెడ్డిపై చర్యలేవి?'

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వైసీపీనేత, మాజీ మంత్రి పెదిరెడ్డి రామచంద్రారెడ్డిపై పలు ఆరోపణలున్నా ఇంత వరకూ ఒక ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ విమర్శించారు. రాజమహేంద్రవరంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎక్కడైనా చీకటి ఒప్పందాలు జరిగియా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయన్నారు. రాజకీయాలు బీసీలను వాడుకుంటున్నాయన్నారు.

'బీమా రంగంలో నూరుశాతం విదేశీ పెట్టుబడులు వద్దు'



ఎల్ఐసీ డివిజనల్ ఆఫీసు వద్ద విదేశీ పెట్టుబడులను వ్యతిరేకిస్తూ నిర్వహిస్తున్న గేట్ మీటింగ్

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):కేంద్ర బడ్జెట్‌లో దేశీయ బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 74 శాతం నుంచి 100 శాతం పెంచడానికి చేసిన ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ రాజమండ్రి డివిజన్ అధ్యక్షుడు ఎస్ఆర్‌జె.మాథ్యూస్ డిమాండ్ చేశారు. యూనియన్ పిలుపు మేరకు రాజమహేంద్రవరం ఎల్ఐసీ డివిజనల్ ఆఫీసు వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఈ ప్రతిపాదనలను అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. తక్షణమే ఉపసంహరించాలని కోరారు. నూటికి నూరు శాతం విదేశీ పెట్టుబడుల వల్ల బీమా కంపెనీలు పూర్తిగా విదేశీ సంస్థల అధీనంలో నడిచే ప్రమాదం ఉందన్నారు. దీని వల్ల మోసాలు జరుగుతాయన్నారు. ఇది భారత దేశంలోని పాలసీదారుల ప్రయోజనాలకు ఇబ్బంది కలిగిస్తుందని తెలిపారు. ఎల్ఐసీ సంస్థను మరింత బలోపేతం చేసి బీమా రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రతిపాదన విరమించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జాయింట్ సెక్రటరీ పీఎస్ఎన్.రాజు, ఉపాధ్యక్షుడు సీహెచ్.సత్యదేవ, జి.శ్రీనివాస్, కోశాధికారి వి.ఈశ్వరరావు, డివిజనల్ నాయకులు పాల్గొన్నారు.

కాన్సర్‌పై అవగాహన అవసరం



ధవళేశ్వరంలో ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ గణేష్

» మెగా అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మానవాళి మనుగడకు ప్రమాదకరంగా మారుతున్న క్యాన్సర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని, ముఖ్యంగా మహిళలు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని,ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవాలని పలువురు ప్రముఖులు కోరారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం, జీఎస్ఎల్ క్యాన్సర్ హాస్పిటల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో మెగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏవీ అప్పారావు రోడ్డులోని రామాలయం సెంటర్లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌పై పోరాటం సాగిస్తూనే, బాధితులకు మనమంతా అండగా నిలవాలన్నారు. ర్యాలీలో రోటరీ ఐకాన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ తీగెల రాజా, వెంకట్ ఇమ్మని, సురేష్, జీఎస్ఎల్ హాస్పిటల్ డాక్టర్ తరుణ్, జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: నగరంలో జవహర్ వాకర్స్‌క్లబ్ సారథ్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో డెల్టా హాస్పిటల్ క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ మండవ సుమంత్ మాట్లాడారు. ప్రస్తుతం దేశంలో ప్రతి పది మందిలో ఒకరు క్యాన్సర్ బారిన పడుతున్నారని, వారిలో ప్రతి 15 మందిలో ఒకరు మరణిస్తున్నారన్నారు. ప్రతిఒక్కరికి వ్యాధిపై అవగాహన ఉండాలన్నారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే తేలికగా తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఉండవల్లి సత్యనారాయణ, సెక్రటరీ, ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ధవళేశ్వరం: కమ్యూనిటీ పారా మెడికిడ్సి అండ్ పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మండలాధ్యక్షుడు రెహ్మన్‌ఖాన్ ఆధ్వర్యంలో స్థానిక స్టేట్ బ్యాంక్ వద్ద నుంచి బస్టాండ్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీని ధవళేశ్వరం సీఐ టి.గణేష్ ప్రారంభించి మాట్లాడారు. క్రమశిక్షణతో కూడిన జీవితం గడపడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. గ్రామాల్లో పీఎంపీలు అందిస్తున్న సేవలను కొనియాడారు. ముఖ్య అతిథి అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు అందరూ చేయించుకునే విధంగా పీఎంపీలు అవగాహన కలిగించాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు మాట్లాడుతూ ప్రారంభంలోనే గుర్తించడం ద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బల్ల శ్రీనివాసరావు, పీఎంపీలు పి.దేవానందం, మట్టా రమేష్, యు.ప్రసాద్‌బాబు, బేబి సరోజిని, ఎస్. లక్ష్మణరావు, కె.లక్ష్మీనారాయణ, విశైలజ, ఎం.బాపూజీ, గట్టి శ్రీనివాసరావు, కె.ప్రసాద్, సుబ్బారాయుడు, సత్యం నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



కల్యాణచక్రస్నానంలో సుదర్శనమూర్తికి పుష్పాభిషేకం చేస్తున్న దృశ్యం

దివాన్‌చెరువు, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి) : దివాన్‌చెరువులోని డీబీవీ రాజు టౌన్‌షిప్‌లోని ఆలయంలో ఉన్న శ్రీభూగోదా ఆండాళ్ సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి వార్షిక కళ్యాణమహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. రథసప్తమి సందర్భంగా ఉదయం నుంచి పంచామృత స్నపన, చక్రస్నానం, చక్రపెరుమాళ్, సుదర్శనమూర్తిగా విశేషపూజలు, మహాపూర్ణాహుతి, కళ్యాణ చక్రస్నానంలో సుదర్శనమూర్తికి పుష్పాభిషేకం కార్యక్రమాలు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయప్రధాన అర్చకులు ఖండవిల్లి రాధాకృష్ణమాచార్యులు పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. సాయంత్రం 12 రకాల ఫలాలు, తీపి పదార్థాలు నివేదనలతో ద్వాదశ ప్రదక్షిణాలు చేశారు.

శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోండి

గోకవరం, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం కొత్తపల్లి ఆదర్శ డీ ఫార్మసీ కళాశాల్లో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ కాకినాడజిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. కొత్తపల్లి ఆదర్శ ఫార్మసీ కళాశాల్లో ఏర్పాటుచేసిన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించారు. నవీన్ మాట్లాడుతూ మందుల ఎంపికలో ఫార్మాశిస్టులపాత్ర చాలా కీలకమైనదన్నారు. కళాశాల చైర్మన్ ప్రగళ్ళపాటి కనకరాజు మాట్లాడుతూ జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ తరగతుల ఆమోదం పొందిన ఏకైక కళాశాల ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ అన్నారు. నాల్గు రోజులపాటు ఈ శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ త్రినాద్‌రావు, కోఆర్డినేటర్ ప్రగళ్ళపాటి శ్రీనివాస్, కామేష్, పవన్, విజయ్‌కుమార్, వలసరెడ్డి, సంకీర్తన, అలేఖ్య, విరాజి, దీపిక, ప్రీతి, స్వర్ణ, సబీనా, తదితరులు పాల్గొన్నారు.

తంటికొండ కొండపై రథ సప్తమి పూజలు



తంటికొండ కొండపై పూజలు చేస్తున్న జ్యోతుల నవీన్, రాజానగరంలోని సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో..

గోకవరం, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): స్వయంభు పాద స్పర్శతో గోకవరం మండలం తంటికొండపై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు రెండోరోజైన మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రథసప్తమి వేడుకలను ఆలయ నిర్వాహకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు టీడీపీ కాకినాడజిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యభగవానుడికి ప్రత్యేకంగా నిర్వహించిన ఆవు పిడకలతో కూడిన అగ్నిహోత్రంలో నవీన్ స్వయంగా పాల్గొన్నారు. లక్ష తులసి పూజా కార్యక్రమం విశిష్టంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో స్వామివారిని అలంకరించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు స్వామివారి దర్శనంతో పాటు, తీర్థప్రసాదాలు, అన్నదానం ఏర్పాటుచేశారు. నవీన్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తంటికొండ వెంకన్న ఆలయాన్ని ఎమ్మెల్యే జ్యోతులు నెహ్రూ సహకారంతో టీడీడీ నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే స్థానిక స్కంధ బాలాజీ సూర్య దేవాలయ ప్రాంగణంలో మంళవారం రథసప్తమి వేడుకలు జరిగాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపట్టారు. ప్రముఖ వ్యాపారవేత్త అక్కింతల రాజా ఆధ్వర్యంలో ధన్వంతరి హోమం నిర్వహించారు. వేడుకలకు హాజరైన సుమారు 5వేల మంది భక్తులకు శ్రీలక్ష్మీసాయి జ్యూయలరీ అధినేత పట్నాల నాగేంద్ర అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. అనంతరం సూర్యపీఠం సభ్యులు నాగేంద్ర, రాజాలను ఘనంగా సత్కరించారు.

రాజానగరం: రథ సప్తమి పర్వదినాన్ని మంగళవారం మహిళలంతా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శిరస్సుపై జిల్లేడు ఆకులు, రేగుపండ్లు ఉంచి స్నానమాచరించారు. ప్రత్యక్ష దైవం ఆదిత్యునికి నమస్కరిస్తూ అర్ఘం సమర్పించారు. అనంతరం ఆవు పిడకలపై ఇత్తడి పాత్ర ఉంచి ఆవుపాలతో క్షీరాన్నం వండి సూర్య భగవానుడికి చిక్కుడు ఆకుల్లో ప్రసాదంగా నివేదించి, విశేష పూజలు చేపట్టారు. రాజానగరంలోని శ్రీ వల్లీ దేవసేన సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్థానిక పురోహితులు సూర్య నమస్కారాలు ఆసనాల రూపంలో ఆచరించారు.

క్యాన్సర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలి



అనపర్తి ఏరియా ఆసుపత్రి వద్ద క్యాన్సర్ అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి

● అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రామగుర్రెడ్డి

అనపర్తి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్యాన్సర్ అవగాహనా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అనపర్తిలోని ఏరియా ఆసుపత్రి నుంచి కమ్యూనిటీ పారా మెడిక్స్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని ప్రారంభించిన సూపరింటెండెంట్ డాక్టర్ రామగుర్రెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్‌ను గుర్తించడంలో ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఎంఎన్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వాసంశెట్టి నాగేశ్వరరావు, సాయి రామారెడ్డి, నీలంశెట్టి శ్రీనివాస్, బాలసుబ్రహ్మణ్యం, సత్యప్రసాద్, సురేష్, తిరుపతిరావు, శిలార్ సాహేబ్ పాల్గొన్నారు.

జీవన శైలి మార్పులతో క్యాన్సర్‌ను నివారించవచ్చు

రాజానగరం: మనిషి జీవనశైలి మార్పుతో క్యాన్సర్‌ను సమూలంగా నివారించవచ్చని జేసీఐ జాతీయ శిక్షకురాలు డాక్టర్ అనసూరి పద్మలత పేర్కొన్నారు. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా రాజానగరం మండలం తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జేసీఐ రాక్ స్టార్స్ ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ పద్మలత ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యారినులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశంలో రోజురోజుకు పెరుగుతున్న క్యాన్సర్ వ్యాధి నివారణకు మనిషి జీవన శైలిలో తప్పనిసరిగా మార్పు రావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో జేసీఐ రాక్ స్టార్ అధ్యక్షులు కృష్ణ సాహితి, కోశాధికారి రవికిరణ్ రెడ్డి, ఉపాధ్యక్షులు రాజి తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురి చేరిక

కోరుకొండ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన 9వ వార్డు పంచాయతీ మెంబర్, దళిత మహిళా నాయకురాలు కలవల బుజ్జి మంగళవారం వైసీపీ నుంచి పలువురు కార్యకర్తలతో జనసేనలో చేశారు. రాఘవాపురంనకు చెందిన జనసేన పార్టీ నాయకుడు నూకతట్టు శివ ఆధ్వర్యంలో పలువురు దళితులు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు జనసేన పార్టీ కార్యాలయంవద్ద ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. జనసేనపార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు నచ్చి తాము జనసేనలోకి చేరినట్లు పార్టీలోకి చేరిన వారు తెలిపారు. పార్టీలోకి చేరిన వారిలో వైసీపీకి చెందిన ముఖ్య నాయకులు కొత్తపల్లిరాజు, కలవల నరేంద్ర, పీతల పండు, నత్తల నాగన్న, కలవల వెంకటేష్, పీతలసుధీర్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ముక్కా రాంబాబు, డాక్టర్ అడపా శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఎలుకల నివారణపై అవగాహన



ఎలుకల నివారణకు మందు కలుపుకునే విధానాన్ని రైతులకు చూపిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

సీతానగరం, ఫిబ్రవరి 4: పంట భూముల్లో ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సీతానగరం రైతు సేవా కేంద్రంవద్ద మంగళవారంజిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయశాఖ ఎలుకల నివారణకు మూకుమ్మడిగా మందు పొట్లాల పంపిణీ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకటనరసింహారావు మాట్లాడుతూ ఎలుకల నివారణకు పొలంగట్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యవసాయాధికారి సూర్యరమేష్, రామతులసి, రైతులు పాల్గొన్నారు

సదరన్ సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ ప్రారంభం

అనపర్తి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నకిలీ ధ్రువపత్రాలతో పెన్షన్లు పొందుతున్న అనర్హులపై త్వరలో వేటు పడనుంది. గత నెలలో మంచానికే పరిమితమై రూ.15వేల పింఛన్ పొందుతున్న లబ్ధిదారుల ఇళ్ళకు వెళ్లి పరీక్షలు నిర్వహించిన అధికారులు సదరన్ సర్టిఫికెట్‌తో రూ..6వేలు పొందుతున్న దివ్యాంగుల అర్హత పరీక్షలు నిర్వహిస్తున్నారు. మంగళవారం అనపర్తి ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన ప్రత్యేక క్యాంపులో ముందుగా సమాచారం అందించిన 30మంది దివ్యాంగులను వారి సర్టిఫికెట్‌లో ఉన్న శాతం నమోదుతోపాటుగా వారి అర్హతను క్యాంపు ఇన్‌చార్జి వైద్యుడు రమేష్ చంద్ర పరీక్షించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి మాట్లాడుతూ సదరన్ వెరిఫికేషన్ శిబిరంలో పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన లబ్ధిదారులకు అవసరమైన సదుపాయాలు కల్పించామన్నారు. ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మండలంలో సదరన్ సర్టిఫికెట్ల ద్వారా 739మంది పెన్షన్లు పొందుతున్నారని వీరందరికీ రోజుకు 30మంది చొప్పున వారంలో నాలుగు రోజులు పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు.

డాక్టర్ గన్ని భాస్కరరావుకు సీఎస్ఆర్ హీరోస్ అవార్డు ప్రదానం



మహారాష్ట్ర గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ గన్ని భాస్కరరావు

రాజానగరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వైద్య వృత్తితోపాటు అనేక సేవా కార్యక్రమాలు అందిస్తున్నందుకుగానూ జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల వ్యవస్థాపన చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావుకు అవార్డు లభించింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సబిలిటీ(సీఎస్ఆర్)లో భాగంగా ప్రముఖ దినపత్రిక నవభారత్ టైమ్స్ మంగళ వారం ముంబైలో నిర్వహి ంచిన నాల్గవ నవ భారత సీఎస్ఆర్ సమ్మేళనంలో ఈమేరకు మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ నుంచి డాక్టర్ గన్ని సీఎస్ఆర్ హీరోస్ 2025 అవార్డు అందుకున్నారు. పశుపోషణ, సంస్కృతి పరిరక్షణ ప్రోత్సాహాల్లో సేవలందిస్తున్నందుకుగానూ ఈ అవార్డు ఎంపిక చేశారన్నారు. ఈసందర్భంగా అవార్డు గ్రహీత డాక్టర్ భాస్కరరావును పలువు రు అభినందనలు తెలిపారు.

కూటమి అభ్యర్థి విజయం కోసం కృషిచేయాలి

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి




రామవరంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరం విజయం కోసం ని యోజకవర్గ కూటమి నేతలంతా కృషి చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నా రు. మంగళవారం మండంలోని రామవరంలో నియోజకవర్గ కూటమి నేతలతో కలిసి ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. నియోజకవర్గ పరిశీలకునిగా విచ్చేసిన మోకా ఆనంద సాగర్, చింతల రామకృష్ణలు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలలో అనపర్తి నియోజకవర్గం నుంచి రాజశేఖరానికి అత్యధిక మెజార్టీని అందించాలని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు రావాడ నాగు, బీజేపీ నాయకుడు శివరామకృష్ణంరాజు, టీడీపీ నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, జుత్తుగ సూర్యకుమారి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పైప్‌లైన్ లీకు

● కలుషిత మవుతున్న మంచినీరు.

సీతానగరం, ఫిబ్రవరి 4 : మండల కేంద్రమైన సీతానగరంలోని శెట్టిబలిజపేటలో మంచినీటి పైప్‌లైన్ మురికి కాలువలోనుంచి వెళ్ళింది. మురికి కాలువలో ఉన్న మండినీటి పైప్‌లైన్ గొట్టంలీకై నీరు బయటకు వస్తోంది. పై నుంచి మురుగునీరు పారుతుండడంతో మంచినీరు కలుషిత మవుతోంది. ఇప్పటికే ఒకసారి ఇదే పంచాయతీలో డయేరియా వ్యాపించింది. సుమారు 13 మంది వరకు అస్వస్థతకు గురయ్యారు. అయినా పంచాయతీ మంచినీటి పైప్‌లైన్‌ల విషయంలో శ్రద్ధ చూపకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అసలే డ్రైనేజీల పూడికతీతలు అంతంత మాత్రంగా ఉంటే ఆ డ్రైనేజీలో నుంచే మంచినీటి పైప్‌లైన్ వెళ్లడం, ఆ డ్రైనేజీలోని లీకవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి పైప్‌లైన్ సరిచేయాలని కోరుతున్నారు.






నరసన్న పెళ్లికి రారండి..



చంద్రప్రభ వాహనంపై ఊరేగింపు

అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాలు మంగళవారం రాత్రి నుంచి ఆరంభమయ్యాయి. ఆదిదేవుడు లక్ష్మీనరసింహస్వామిని పెండ్లి కొడుకుగా.. అమ్మవారిని పెండ్లి కుమార్తెగాను ముస్తాబు చేశారు.. ఈ క్రతువు తిలకించేందుకు వేలాదిగా భక్తజనం తరలివచ్చారు.. ఇక 7వ తేదీన స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. ఉత్సవాలు 13వ తేదీ వరకూ జరుగుతాయని ఆలయ అధికారులు తెలిపారు. - వివరాలు 6లో

అడవిలో..అలజడి!





మంగళవారం మధ్యాహ్నం ఆకాశంలో పెద్ద ఎత్తున పొగలు కమ్ముకున్నాయి.. ఎక్కడి నుంచి వస్తున్నాయి.. ఎలా వస్తున్నాయి అనే అలజడి.. ఎక్కడో ఏదో జరిగిపోతోందన్న ఆందోళన.. ఏం జరుగుతుందో తెలియదు.. జాతీయ రహదారిపై కూడా పెద్దఎత్తున పొగలు కమ్ముకున్నాయి. పరిసర ప్రాంతాల ప్రజానీకం చాలామంది అప్పటికే అప్రమత్తమై పోయారు. అయితే చాలాసేపటి తర్వాత రాజమహేంద్రవరానికి కూతవేటు దూరంలో ఉన్న రిజర్వు ఫారెస్టులో మంటలు చెలరేగాయని తెలియడంతో కొంత ఊపిరి పీల్చుకున్నారు.. ఆ తర్వాత మంటలను అదుపుచేశారు. కాగా మంత్రి దుర్గేష్ దహనమైన అడవిని పరిశీలించారు. - వివరాలు 8లో




ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

వైద్యులు సమయపాలన పాటించాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి (జీటీజీహెచ్)ను కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎప్పుడూ ముందస్తు సమాచారంతో వచ్చే కలెక్టర్ ఈ సారి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఆకస్మికంగా రావడంతో ఆసుపత్రి అధికారులు, వైద్యులు, సిబ్బంది పరుగులు పెట్టారు. ప్రత్యేకించి అవుట్‌పేషెంట్ విభాగాలను కలెక్టర్ సందర్శించి అక్కడ వైద్యులు, వైద్య సహాయకులు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. జనరల్ మెడిసిన్‌తో పాటు ఇతర విభాగాలను పరిశీలించారు. ఎంసీహెచ్ బ్లాకులోని ప్రసూతి, పిల్లల విభాగాన్ని సందర్శించారు. వైద్యులు సమయపాలన పాటిస్తున్నారా లేదా అనేదానిపైనా దృష్టి సారించారు. హాజరుపట్టీని కూడా పరిశీలించారు. జనరల్ మెడిసిన్ విభాగంలో ఇద్దరు వైద్యులు గైర్హాజరుపై కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆసుపత్రి వేక్షణాధికారిగా ఉన్న సూపరింటెండెంట్ ఈ విషయంలో కీలకంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజలకు వైద్యసేవలందించే క్రమంలో డాక్టర్లు కచ్చితంగా సమయపాలన పాటిస్తూ అందుబాటులో ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు.ఆమె వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ, ప్రత్యేకాధికారి డి.భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

సమగ్ర శిక్ష సెక్టోరియల్ పోస్టులకు
దరఖాస్తులు ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఏపి సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వారి మౌఖిక ఆదేశాల మేరకు జిల్లాలో గల సమగ్ర శిక్షా రాజమహేంద్రవరం కార్యాలయంలోని సెక్టోరియల్ పోస్టులు, ప్లానింగ్ అండ్ ఎంఐఎస్ కోఆర్డినేటర్, అసిస్టెంట్ అల్టర్నేటివ్ స్కూల్ కోఆర్డినేటర్, గరల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నమని సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎస్ సుభాషిణి తెలిపారు.ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ పోస్టులకు స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్మెంట్‌లో పనిచేస్తున్న 55 ఏళ్ళలోపు వయసు సుమారు 8 ఏళ్ల సర్వీసు ఉన్న స్కూల్ అసిస్టెంట్లు అర్హులని తెలిపారు.మరింత సమాచారం కోసం సమగ్రశిక్ష ఎస్‌వో ప్రసాద్ 94419 08345 నెంబరును సంప్రందించాలన్నారు.



కొవ్వూరు బీసీ హాస్టల్‌లో
ఆర్‌డీవో విచారణ

కొవ్వూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు ప్రభుత్వ బాలుర బీసీ వసతిగృహంలో మంగళవారం రాత్రి కొవ్వూరు ఆర్డీవో డా.రాణి సుస్మిత విచారణ చేపట్టారు. హాస్టల్‌కు వెళ్లి విద్యార్థులు, వసతిగృహ అధికారి, సిబ్బందిని విచారించారు.ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ ఆదివారం హాస్టల్‌లో మతపరమైన ప్రార్థనలు జరుగుతున్నాయని వచ్చిన వార్తలపై విచారణ చేపట్టడం జరిగిందన్నారు.బీసీ హాస్టల్ అద్దె భవనంలో కొనసాగుతుందన్నారు. భవన యజమానులు ఆదివారం మధ్యాహ్నం భవనం పైఅంతస్తులో ఎవరికీ చెప్పకుండా పైకి వచ్చి ప్రార్థనలు నిర్వహించడానికి సన్నాహాలు చేశారన్నారు. అదే విధంగా విద్యార్థులు ప్రార్థనలు మాకు ఇష్టం లేదని భవనం కిందకు వచ్చేశామని ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరుగుతుందన్నారు. ఈ రెండు అంశాలపై పూర్తిగా విచారించి నివేదికను జిల్లా కలెక్టరుకు అందిస్తామన్నారు. అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికా రి, వసతిగృహ అధికారి చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి నిమిత్తం ఎక్కడో తమిళనాడు నుంచి వచ్చారు.. జిల్లాలోని ఒక పట్టణంలో స్థిరపడ్డారు. ఏ బాదరబందీ లేదు.. ఒక్కతే కుమార్తె.. అమ్మాయిది డిగ్రీ పూర్తయింది.. ఉద్యోగమూ వచ్చేసింది.. ఆ తల్లిదండ్రులకు ఇంకేం ఆలోచన ఉంటుంది..మంచి అబ్బాయిని చూసి పెళ్లిచేయడమే తరువాయి..ఇలా అనుకుంటుండగానే ఆ అమ్మాయి చేసిన స్నేహం కుటుంబ ఆర్థిక పరిస్థితిని ఛిన్నాభిన్నం చేసింది.. నాకు అడిగినంతా ఇవ్వకపోతే నీ న్యూడ్ వీడియోలు నెట్‌లో పెడతానని బెదిరించడంతో యువతి.. తల్లిదండ్రులు బెదిరిపోయారు.. అడినంతా ఇచ్చి అప్పులపాలయ్యారు. సొంతిల్లు వదిలేసి అద్దె ఇంట్లో తలదాచుకోవాల్సిన పరిస్థితికి తెచ్చింది.. చివరికి చేసేదేంలేక పోలీసులను ఆశ్రయిం చడంతో ఐదేళ్ల ఆవేదన బయటకొచ్చింది.



కొవ్వూరుకు చెందిన ఒక బాలిక ఇంటర్ చదువుతోంది.. తల్లిదండ్రులకు కష్టమైనా రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు కళాశాలలో చదివిస్తున్నారు.. ఆ అమ్మాయిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.. అయితే చదువుకోవడానికి వెళ్లిన అమ్మాయి అక్కడ అధ్యాపకుడు చెప్పిన మాయమాటలకు లొంగిపోయింది.. ఇటీవల అతను వెంట తీసుకెళ్లిపోయి అత్యాచారానికి ఒడిగట్టాడు. కంగారుపడిన తల్లిదండ్రులు పోలీ సులకు ఫిర్యాదు చేయడంతో ఇద్దరినీ పట్టుకున్నారు.. బాలిక ఫిర్యాదు మేరకు అధ్యాపకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.



అమ్మాయిలూ.. జాగ్రత్త!

స్నేహం ముసుగులో మోసాలు

- ప్రేమ పేరుతో యువకుల వల
- చిక్కిపోతున్న అమ్మాయిలు
- స్మార్ట్ ఫోన్లతో పతనం
- బలహీన క్షణాల్లో బంధీగా
- తల్లిదండ్రుల ఆశలపై నీళ్లు
- చివరికి మిగిల్చేది కన్నీళ్లు
- పోలీస్‌స్టేషన్లలో కేసులు
- నిడదవోలు ఘటనే నిదర్శనం
- గతేడాది అత్యాచార కేసులు 43
- యువతుల మిస్సింగ్ 145
- మహిళల అదృశ్యం 258
- పోలీసులకూ సవాల్

ప్రస్తుత సమాజంలో అమ్మాయిలు మోసపోతున్న ఘటనలు సర్వసాధారణంగా మారిపోయాయి.. ప్రతి రోజూ ఏదో ఒక మూల కేసులు నమోదవుతూనే ఉన్నాయి.అయినా అమ్మాయిల్లో మాత్రం మార్పురావడం లేదు.. స్మార్ట్ ఫోన్లు.. దానికి తగినట్టు స్నేహాలు అమ్మాయిల జీవితాలను అడ్డదారి పట్టిస్తున్నాయనడంలో సందేహం లేదు. జిల్లా వ్యాప్తంగా గతేడాది చూస్తే 43 పోక్సో కేసులు నమోదయ్యాయి.145 అమ్మాయిల మిస్సింగ్ కేసులు ఉన్నాయి.. వివాహిత మహిళల అదృశ్యం కేసులు 258.. ఇవి పోలీస్ స్టేషన్లకు వరకూ వచ్చినవి..రానివి ఎన్నో చెప్పడం కష్టమే.. ఈ కేసుల్లో ప్రతి కేసూ ఒక కథే.. మోసపోయిన జీవితగాథలే.. కొంత మంది ఆ మోసాల నుంచి బయటపడుతుంటే.. మరికొంత మంది భరించలేక ప్రాణాలే తీసుకుంటున్నారు..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రేమ.. ఆకర్షణ.. అవసరం.. వాంఛ.. వీటి మధ్య ఉన్న సున్నితమైన గీతను గుర్తించడంలో విఫలమవుతున్న అమ్మాయిలు అమాయకంగా తమంతట తాముగా వెళ్లి తమ జీవితాలను, తమ తల్లిదండ్రుల ఆశలను ఛిద్రం చేసే వలకు చిక్కుతూ చిక్కుముడుల సుడిగిండంలో ఇరుక్కుంటున్నారు. తీరా ఆ 'క్షణాల' తప్పును గ్రహించే సరికి వేధింపుల గుప్పిట్లో బందీలవుతున్నారు. భారతీయ సంస్కృతిలో ఆడవారికి ఓ ప్రత్యేకమైన స్థానం ఉంది.ఎంతో గౌరవాన్ని ఇచ్చింది. కానీ ఇవాళ పాశ్చాత్య పోకడల వెర్రిలో తెల్ల కాగితంలా ఉండాల్సిన జీవితాలు మసిబారిపోతున్నాయి. ఇటు తల్లిదండ్రులను సమాజంలో, బంధువుల్లో చులకన చేస్తున్నారు. ఆలోచనా లేమితో కొందరు అమ్మాయిలు చేస్తున్న చక్కదిద్దుకోలేని పొరబాట్లకు ప్రతిక్షణం కుంగిపోతూ జీవచ్ఛవాల్లా బతుకుతున్న అమ్మా నాన్నలు ఎంతో మంది ఉన్నారు. కొందరు అమ్మాయిలు కెరీర్ అంటూ ముందుకు దూసుకుపోతుంటే..మరికొందరు 'క్షణాల్లో' జీవితాన్ని పాడు చేసుకుంటున్నారు.చాలా మంది సెల్‌ఫోన్ల వల్ల పతనం అవుతున్నారనేది నిర్వివాదాంశం. అందుకే..'అమ్మాయిలూ..కాస్త ఆలోచించండమ్మా!'. స్నేహమన్నా.. జాగ్రత్తగా ఉండాల్సిందే..

అత్యాచార కేసులు 43.. అమ్మాయిల మిస్సింగ్ 145

తూర్పు గోదావరి పోలీసు రికార్డుల ప్రకారం గతేడాది 18ఏళ్ల పైబడిన వారిపై 23,18ఏళ్ల లోపు అంటే పిల్లలపై 43 అత్యాచార కేసులు నమోదయ్యాయి. ఈ 43 కేసుల్లో ఓ ఏడు తప్ప..36 ప్రేమ పేరుతో పరాౖెనవే కావడం గమనార్హం. ఇక ఆ 23 కేసుల్లో నాలుగు తప్ప మిగతా వాటిలో పెళ్లి చేసుకుంటామని చెప్పినవి ఉన్నాయి.ఈ గణాంకాలు చూస్తుంటే ఎంత మంది తల్లిదండ్రులు శోకంలో జీవిస్తున్నారో.. బంధువులు, ఇరుగుపొరుగు వారి ముందు తలదించుకొని బతుకుతు న్నారో అర్థం చేసుకోవచ్చు. గతేడాది ఆడపిల్లల మిస్సింగ్ కేసులు 145 నమోదు కాగా 142 మందిని పోలీసులు గుర్తించి తీసుకొచ్చారు. మహిళల అదృశ్యం కేసులు 258 ఉండగా 233 మందిని పోలీసులు గు ర్తించారు.ఇవి పోలీస్ స్టేషన్ల వరకూ వచ్చిన కేసులు మాత్రమే..రాని కేసులు చాలానే ఉంటాయి. ఎందుకంటే పరువు పోతుందనే కారణంగా పోలీస్ స్టేషన్ల వరకూ రాని కేసులు పదుల సంఖ్యలో ఉంటాయి.మాయమాటలతో విసిరే వలలో చిక్కుకొని జీవితాలు నాశనం చేసుకోవద్దంటూ ఉదాహరణలను వివరిస్తూ పోలీసులు అవగాహన కల్పిస్తున్నా కొందరు అమ్మాయిలు ఇంకా జీవిత సత్యాన్ని గ్రహించలేక పోవడం బాధాకరంగా కానవస్తోంది.

స్నేహం మాటున..

స్నేహం మాటున ఇవాళ జరుగుతున్న ఆకృత్యాలు అమ్మాయిల జీవితాలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. కట్టు తప్పుతూ పట్టు కోల్పోతున్నారు. తమ ఆత్మాభిమానాలను సైతం ఇతరుల చేతిలో బంధీ చేస్తున్నారు. ఎక్కడో ఏదో సందర్భంలో స్నేహమంటూ నాలుగు మాటలు కలుపుతారు. దానిని కొద్ది రోజులు సాగదీస్తూ వెళతారు. ఆపై ఆకర్షణకు లొంగిపోతారు. చిక్కుముడిలో చిక్కిపోతున్నారు. గతంలో స్నేహం చేశారంటే ఒక నమ్మకం ఉండేది.. నేడు అవసరమే స్నేహంగా మారింది.అది గుర్తించలేని అమ్మాయిలు మోసగాళ్ల వలకు చిక్కి బలైపోతున్నారు. ఆధునిక జీవులం అనుకుంటూ అందరినీ ఆవేదనకు గురి చేస్తున్నారు. ఆడ పిల్ల పుట్టిన నాటి నుంచే ఎంతో పొందికగా పెంచి పెద్ద చేయాలని పెద్దలు తాపత్రయ పడతారు. అలాగే పెంచుతారు. అయితే చిన్న తప్పుతో జీవితాలను బలిచేసుకుంటున్నారు.

నేడు జిల్లాలో ఇన్‌చార్జి మంత్రి
నిమ్మల పర్యటన

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు కేడర్‌ను సమాయత్తం చేయడానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు బుధవారం మంత్రి కందుల దుర్గేష్ తో కలిసి జిల్లాలో పర్యటించనున్నారు. బుధవారం ఉదయం 9 గంటలకు నిడదవోలు, 11 గంటలకు గోపాలపురం, మధ్యాహ్నం 1గంటకు కొవ్వూరు, సాయంత్రం 3 గంటలకు రాజానగరం, 5 గంటలకు రాజమహేంద్రవరం అర్బన్, 6.30 గంటలకు రాజమండ్రి రూరల్ కూటమి శ్రేణుల సమావేశాల్లో పాల్గొంటారు. నిడదవోలు పరిధిలోని కానూరు వైనాట్ ఫంక్షన్ హాల్, దేవరపల్లి,కొవ్వూరు, మధురపూడి టీడీపీ ఆఫీసుల్లో, రాజమండ్రి సిటీ, తర్వాత ప్రియాంక గార్డెన్స్ మీటింగ్‌లో పాల్గొంటారు.

ఇంటి కోసం గొడవ..
వివాహిత ఆత్మహత్య



నల్లజర్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలు ఒక వివాహిత ప్రాణం తీశాయి. నల్లజర్ల మండలం పోతవరం పంచాయతీ కృష్ణాయిగూడెం గ్రామానికి చెందిన జొన్నకూటి సుబ్బారావు కుమారుడు రాజు కోమటికుంటకు చెందిన నాగదుర్గ(26)ని సుమారు ఆరేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు.వీరికి కుమారుడు,కుమార్తె ఉన్నారు.నాటి నుంచి అత్తమామలతో కలిసే జీవి స్తుంది. భర్త చిన్న పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెలకొస్తున్నాడు. ఇదిలా ఉండగా ఇటీవల తాము ఉంటున్న ఇంటి విషయమై మామ సుబ్బారావు,బావ గంగరాజు కలిసి నాగదుర్గతో గొడవపడుతున్నారు. ఇదిలాఉండగా ఇటీవల నల్లజర్లలో పోలీసులకు బావ గంగరాజుపై మరదలు దుర్గ ఫిర్యాదు చేసింది.పోలీసులు పట్టించుకోలేదు. దీంతో వేధింపులు మరింత ఎక్కువయ్యాయి. తట్టుకోలేకపోయిన నాగదుర్గ తీవ్ర మనస్తాపానికి గురైంది. సోమవారం భర్త పనిలోకి వెళ్లిన తరువాత పిల్లలను స్కూల్‌కి పంపించి బట్టలు నానబెట్టుకుంది. అనంతరం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.అత్తగారు గమనించి చుట్టుపక్కల వారిని పిలిచి కిందకు దింపారు.అప్పటికే ఆమె మృతి చెందిఉంది.పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు తరలించారు. మృతురాలి తండ్రి సేనాపతి సుబ్బారావు పిర్యాదు మేరకు అత్తమామలైన సుబ్బారావు, సువర్ణ, బావగారు గంగరాజు, ఆడబడుచు పున్నమ్మలపై కేసు నమోదు చేశారు.

8న ధవళేశ్వరం
జనార్దనస్వామి రథోత్సవం

ధవళేశ్వరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కొండపై కొలువైన లక్ష్మీజనార్దన స్వామి కల్యాణోత్సవాలు 8 నుంచి 13 వరకు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ మేరకు ఆలయ ప్రాంగణం కొండ పైకి వెళ్లే మెట్ల మార్గాన్ని రంగులతో,చలువ పందిళ్ళతో అందంగా తీర్చిదిద్దుతున్నారు.దిగువున మెట్ల మార్గం నుంచి రామపాదాల ఘాట్ వరకు ఉన్న రహదారి పొడవునా చలువ పందిళ్లు వేసి విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు.8న రథోత్సవం నేపథ్యంలో దక్షిణ మండలి డీఎస్పీ భవ్య కిషోర్, సీఐ పి.గణేష్‌లు, ఏఎస్‌ఐలు మంగళవారం ఆలయ పరిసరాలతో పాటు రథోత్సవం జరిగే రహదారిని పరిశీలించి బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. ఆలయ ఈవో కె. సురేష్ భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. రథసప్తమిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం స్వామి వారి రథానికి ఆలయ అర్చకుడు ఎస్‌వీఎస్ఎన్ ఆచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. పడమర ముఖంగా ఉన్న రథాన్ని భక్తులు తూర్పు ముఖంగా నిలిపారు.

కాలువలకు నీరు విడుదల

ధవళేశ్వరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కాటన్ బ్యారేజ్ నుంచి డెల్టా కాలువలకు 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టా కాలువకు 2300 క్యూసెక్కులు,మధ్యడెల్టా కాలువకు 1700, పశ్చిమడెల్టా కాలువకు 4 వేల క్యూసెక్కులు చొప్పున విడుదల అవుతుంది.నీటిమట్టం 9.40 అడుగులుగా ఉంది.సీలేరు నుంచి పవర్ జనరేషన్ ద్వారా 3800 క్యూసెక్కులు గోదావరిలో కలుస్తుండగా గోదావరిలో నీటిలభ్యత 8,692 క్యూసెక్కులుగా ఉంది.

ఆక్రమిత నివాస స్థలాల క్రమబద్ధీకరణ

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని నివాసాలు ఏర్పాటు చేసుకున్న అభ్యంతరం లేని పేదల ఇళ్ల స్థలాలను క్రమ బద్ధీకరించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని కలెక్టర్ పి. ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు గత నెల 29న జీవో 30ని విడుదల చేశారన్నారు. ఈ పథకం కింద నివాస స్థలాలను క్రమబద్ధీకరించుకునేవారు ఈ ఏడాది డిసెంబర్ 31 లోపు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. గ్రామాల్లో రూ.1.20 లక్షల వార్షికాదాయం, పట్టణాల్లో 1.44 లక్షల వార్షికాదాయం ఉన్న బీపీఎల్ కుటుంబాలన్నీ అర్హులేనన్నారు. ఈ పథకం జీవిత కాలంలో ఒక్కసారే వర్తిస్తుందని స్పష్టం చేశారు. బేసిక్ వేల్యూ చెల్లింపు, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియ చేపడతామన్నారు. అర్హత కలిగిన లబ్దిదారులు తమ పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గతంలో దరఖాస్తు చేసిన వారు తగిన ఆధారాలు, డాక్యుమెంట్లతో కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, నిర్ధారణ చేసిన తర్వాత అర్హులకు కేటాయిస్తారన్నారు. అర్హుల జాబితాను రెవెన్యూ డివిజనల్ స్థాయి కమిటీ పరిశీలించి, ఆమోదిస్తుందన్నారు.

ఈ-శ్రమ్‌లో నమోదైతే ఉపాధి

ఈ-శ్రమ్ కార్డు వల్ల ఉపయోగాలను అసంఘటిత రంగ కార్మి కులకు వివరించడంతో పాటు ప్రతి ఒక్కరూ ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకొనే విధంగా అవగాహన కల్పించాలని అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు.ఈ అంశంపై మంగళవారం సమీక్షించారు. జిల్లాలో ఇప్పటి వరకూ 6,03 లక్షల మందిని ఈ-శ్రమ్‌లో రిజిస్ట్రేషన్ చేశారన్నారు. ఈ పోర్టల్‌లో నమోదుకు బ్యాంకు అకౌంట్, ఆధార్ జిరాక్సులు,ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ నెంబరు అవసరమన్నారు. ఈ శ్రమ్‌లో నమోదైతే ఉపాధి అవకాశాలుంటాయన్నారు.

50 డివిజన్లకు ప్రత్యేకాధికారులు

- శానిటేషన్ బాధ్యత వారిదే
- కమిషనర్ కేతన్‌గార్గ్



మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగర ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ప్రతి వార్డుకు ఒక ప్రత్యేక అధికారిని నియమించినట్టు కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం డివిజన్ ప్రత్యేక అధికారులుగా నియమించిన వారితోను,అధికారుతోను కమిషనర్ సమావేశం నిర్వహించారు. నగరాభివృద్ధికి చేస్తున్న కార్యక్రమాలు పర్యవేక్షించి ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, పారిశుధ్య విభాగాలతో సమన్వయంతో చేయడం కోసం 50 డివిజన్లలో నగరపాలక సంస్థ సిబ్బంది, అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిచడం జరిగిందన్నారు.ప్రత్యేక అధికారులుగా కేటాయించిన వారు తమకు కేటాయించిన వార్డుల్లో ప్రత్యేకంగా శానిటేషన్, కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించే కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలను పూర్తిస్థాయిలో పర్యవేక్షించి మొదటి పది ర్యాంకుల్లో ఒక ర్యాంక్ సాధించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. వార్డుల వారీగా వీధి దీపాల నిర్వహణ , నీటి సరఫరా మెరుగ్గా అందేలా చూడడం ప్రత్యేక అధికారుల బాధ్యత అని సూచించారు.సమావేశంలో డిప్యూటి కమిషనర్ ఎస్.వెంకట రమణ, ఎస్ఈ జి.పాండురంగారావు, సిటీప్లానర్ కోటయ్య, మునిసిపల్ ఆరోగ్యఅధికారి డాక్టర్ ఎ . వినూత్న, మేనేజరు అబ్దుల్ మాలిక్ అస్ఫర్, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

బయటకు రావాలంటేనే భయం..భయం!

- జిల్లాలో పెరుగుతున్న నేరాలు
- అచ్చన్నపాలెంలో భారీ చోరీ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిస్థితులు మారుతున్నాయి.. చోరీలు, చైన్ స్నాచింగ్‌లు పెరిగిపోయాయి.రౌడీ మూకలు, అసాంఘిక శక్తులు పేట్రేగుతున్నాయని 'ఆంధ్రజ్యోతి' చెబుతూనే ఉంది. పోలీస్ బాస్‌లకు కొంత ఇబ్బందికరంగానే ఉన్నప్పటికి ఇది అక్షర సత్యం. ఇటీవల బొమ్మూరు మురళీకొండపై వరుసగా నాలుగిళ్లను దోచేసిన సంఘటన మరువక ముందే నల్లజర్ల మండలం అచ్చన్నపాలెంలో మరో భారీ చోరీ జరిగింది. సోమవారం రాత్రి 48 కాసుల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదు గుర్తుతెలియని వ్యక్తులు దోచుకుపోయారు. గత నెలలో ఒకే రోజు కొవ్వూరు, రాజమహేంద్రవరంలో చైన్ స్నాచింగ్‌లు జరిగాయి.సైబర్ నేరాలు పెరిగిపోయాయి.

7.45 గంటలకే చైన్ స్నాచింగ్

రాజమహేంద్రవరం గోదావరి బండ్ రోడ్డు పెట్రోల్ బంకు పక్కనే ఉన్న వీధిలో రాత్రి 7-45 గంటలకు ఒక మహిళ నడచి వెళుతుండగా గుర్తుతెలియనివ్యక్తి బైక్‌పై వచ్చి ఆమె మెడలోంచి 40 గ్రాముల బంగారు ఆభరణాలు లాక్కుని పారిపోయాడు. ఈ సంఘటనతో రాజమహేంద్రవరంలో మహిళలు ఉలిక్కిపడ్డారు. ఒక పక్క ఇస్కాన్ టెంపుల్ ఉండడంతో రద్దీగానే ఉంటుంది. మరో పక్క వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఉంటుంది. అయినా ఏ మాత్రం బెదురు లేకుండా ఒకే వ్యక్తి బైక్‌పై వచ్చి బంగారు గొలుసు ఎలా లాక్కునిపోయాడో అర్థం కావడం లేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గోదావరి బండ్ రోడ్డు రాత్రి 10 గంటల వరకూ రద్దీగానే ఉంటుంది. అటువంటిది 7:45 గంటలకే చైన్‌స్నాచింగ్ జరగడంతో మహిళలు భయపడుతున్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయ తనిఖీలో జడ్పీ సీఈవో సుబ్బారావు


తాళ్లపూడి మండల అధికారులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

తాళ్లపూడి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ తనిఖీల నిమిత్తం విచ్చేసినట్టు జిల్లా పరిషత్ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పాథమిక పాఠశాలల నిర్వహణ, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపిన విషయం మేరకు రాబోయే వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా కలిగించే సౌకర్యాలు, ఇతర అంశాలను పరిశీలించేందుకు మండలంలోని సీడబ్ల్యూపి స్కీం ద్వారా తాగునీటి సరఫరా విషయమై కూడా మండలానికి విచ్చేసినట్టు సుబ్బారావు పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో టీబీవీ రమణ, ఎంఈవోలు బాలామణి, నెహ్రాజీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయితీరాజ్ ఈవోపీఆర్డీ వీరన్న, పలు శాఖల అధికారులతో జడ్పీ సీఈవో సమీక్షించారు.

క్యాన్సర్ నివారణపై అవగాహన ర్యాలీ


నిడదవోలులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నిడదవోలు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీహెచ్‌సీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఫయాజ్ అహ్మద్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ నివారణా దినం సందర్భంగా మంగళవారం నిడదవోలులోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అహ్మద్ మాట్లాడుతూ క్యాన్సర్ దరిచేరకుండా ప్రతిఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవన ఒరవడిని కొనసాగించాలని, ప్రజలను చైతన్య పరిచేందుకే అవగాహన ర్యాలీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు రవికాంత్, వినీల్ అస్మత్, జానకిప్రియ, రెహానా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చాగల్లులో అభివృద్ధి పనులకు రూ.73 లక్షలు

చాగల్లు, ఫిబ్రవరి 4, (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.73 లక్షలు మంజూరయ్యాయని జడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గ, టీడీపీ నాయకుడు గారపాటి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సహకారంతో జిల్లా పరిషత్ నుంచి మంజూరైన నిధులతో చాగల్లు, బ్రాహ్మణగూడెం, మల్లవరం, చంద్రవరం, ఊనగట్ల, మార్కొండపాడు గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లు, తాగునీరు బోర్లు ఏర్పాటుకు అవకాశం కలిగిందన్నారు. బ్రాహ్మణగూడెంలో వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలోని కాలనీలో రూ.43 లక్షలు వ్యయంతో అంతర్గత రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపట్టనున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యం వల్ల కాలనీలో మౌలిక వసతులు, అభివృద్ధి జరగక ప్రజలు ఇబ్బంది పడ్డారని, ప్రస్తుతం నిధులు మంజూరు కావడంతో కాలనీ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందని వాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. నిధుల మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, మండలంలోని తెలుగుదేశం నాయకులకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


యర్నగూడెం జడ్పీ హైస్కూల్ 1985-86 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

దేవరపల్లి, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్నగూడెం జడ్పీ హైస్కూల్లో 1985-86 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు బాల్యమిత్రుల ఆత్మీయ సమావేశం రాజమహేంద్రవరంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆనాటి అల్లరి చేష్టలను, మధురానుభూతులను గుర్తు చేసుకుని స్నేహితులంతా ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మల్లేల వెంకటేశ్వరరావు, బల్లా రవికుమార్, అడబాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పైనుంచి వెళ్లిన హెవీ విద్యుత్‌వైర్లు తొలగించాలి

మండల మాజీ చైర్మన్ షరీఫ్‌కు చిట్యాల గ్రామస్థుల వినతిపత్రం

గోపాలపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్యాల గ్రామంలో విద్యుత్ సరఫరా కేంద్రానికి అనుకుని ఉన్న లేఅవుట్‌లో ఇళ్ల పైనుంచి నిర్మించిన హెవీ విద్యుత్‌వైర్లు తొలగించాలంటూ టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజా వేదిక వద్ద మండల మాజీ చైర్మన్ షరీఫ్‌కు నూతంగి దొరబాబు ఆధ్వర్యంలో గ్రామస్థులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో 25కాలనీ ఇళ్లు మంజూరయ్యాయన్నారు. అయితే ఆ ప్రదేశంలో సబ్‌స్టేషన్ నుంచి హెవీ విద్యుత్‌వైర్లు నిర్మించినందున ఇళ్ల నిర్మాణాలు స్లాబ్‌దశలోనే మిగిలిపోయాయని పేర్కొన్నారు.

కొవ్వూరు బీసీ బాలుర వసతిగృహంలో విచారణ


బాలుర బీసీ హాస్టల్లో విచారణ చేస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహంలో కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత విచారణ చేపట్టారు. మంగళవారం రాత్రి బీసీ వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులు, వసతిగృహ అధికారిని, సిబ్బందిని విచారించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఆదివారం మత పరమైన ప్రార్థనలు జరిగాయని వచ్చిన వార్తలపై విచారణ చేపట్టామ న్నారు. హాస్టల్ అద్దె భవనంలో కొనసాగుతోందని, భవన యజమానులు ఆదివారం మధ్యాహ్నం ఎవ్వరికీ చెప్పకుండా భవనం పైఅంతస్తులోకి వచ్చి ప్రార్థనలు నిర్వహించడానికి సన్నాహాలు చేశారన్నారు. అలాగే వి ద్యార్థులు ప్రార్థనలు తమకు ఇష్టం లేదని భవనం కిందకు వచ్చేశామని ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టామన్నారు. ఈ రెండు అంశాలపై పూర్తిగా విచారించి నివేదికను జిల్లా కలెక్టరుకు అందిస్తామని ఆర్డీవో రాణి సుస్మిత పేర్కొన్నారు.కార్యక్రమంలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి, వసతిగృహ అధికారి చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సూర్యనారాయణుడి కల్యాణం


కొవ్వూరులో పొంగళ్లు తయారు చేస్తున్న మహిళలు

కొవ్వూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు శ్రీనివాస స్నానఘట్టంలో ప్రకృతి రావణ బ్రహ్మ శివాలయంలో నిర్వహిస్తున్న మహా సౌరయాగం 6వ రోజుకు చేరుకుంది. మంగళవారం రథ సప్తమి సందర్భంగా గోదావరి నది ఒడ్డున శ్వేతార్క చెట్టు, మేడి చెట్టు వద్ద మహిళలు ఆవు పిడకలతో వెలిగించిన అగ్నితో పొంగళ్లు తయారు చేసి మహా నైవేద్యం సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ అనపర్తి శివరామకృష్ణ పర్యవేక్షణలో సూర్య ఉపాసకుడు విక్రమాదిత్య ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని యాగం, పూర్ణాహుతి, సూర్యనారాయణమూర్తికి ఉష సౌజన్య, చాయాదేవిలకు శాంతి కల్యాణం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వాలంటూ వృద్ధురాలిపై దాడి

- యువకుడికి స్థానికుల దేహశుద్ధి
- కొవ్వూరు పోలీసులకు అప్పగింత


యువకుడిని తాళ్లతో కట్టేసిన కొవ్వూరు గ్రామస్థులు

కొవ్వూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మద్యానికి డబ్బులు ఇవ్వాలంటూ వృద్ధురాలిపై దాడి చేసిన యువకుడికి స్థానికులు దేహశుద్ధి చేశారు. రాజమహేంద్రవరంలో నివాసం ఉంటున్న జి.లక్ష్మణ్ ఈ నెల 3న కొవ్వూరు ఎక్సైజ్ కార్యాలయం వీధిలో నివాసం ఉంటున్న పెద్దమ్మ చిటికిన సీతామహాలక్ష్మి ఇంటికి వచ్చాడు. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఉన్న సీతామహాలక్ష్మిని మంచంపై పడేసి డబ్బు ఇవ్వాలని పీక నొక్కేయడంతో పెద్దగా కేకలు పెట్టింది. స్థానికులు వచ్చి విడదీయడానికి ప్రయత్నించగా వారిపై తిరగబడ్డాడు. చుట్టు ప్రక్కల వాళ్లు వచ్చి తాళ్లతో కట్టి దేహశుద్ధి చేశారు. అనంతరం పట్టణ పోలీసులకు అప్పగించారు. సీతామహాలక్ష్మి మాట్లాడుతూ లక్ష్మణ్ తన చెల్లెలు కుమారుడని, తరచుగా ఇంటికి వచ్చి వెళ్తుంటాడని, సోమవారం రాత్రి నుంచి వింతగా ప్రవర్తిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది.

ఘనంగా రథసప్తమి

- సూర్యనారాయణుడి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు
- సూర్యనమస్కారాలు సమర్పణ
- ప్రక్కిలంకలో రథోత్సవం


నిడదవోలులో సూర్య నమస్కారాలు చేస్తున్న భక్తులు

నిడదవోలు, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేడుకలను మంగళవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. నిడదవోలులోని బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి పంచాయతన క్షేత్రంలో ఉన్న సూర్య భగవానుడి ఆలయంలో విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు శ్రీకాకోళపు లక్ష్మీనరసింహశాస్త్రి, అభిరామ్‌శర్మ ఆధ్వర్యంలో సూర్యనారాయణుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులతో సూర్యనమస్కారాలు చేయించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తాళ్లపూడి: మండలంలోని ప్రక్కిలంక గ్రామంలోని విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సౌరయాగం వద్ద రథసప్తమి సందర్భంగా విశేష పూజలు చేపట్టారు. అనంతరం ప్రక్కిలంక,తాళ్లపూడి గ్రామాల్లో రథోత్సవాన్ని అర్చకుడు విశ్వనాథ శర్మ పర్యవేక్షణలో శశిశేఖర మిత్ర బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని పలు ఆలయాల వద్ద పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అన్నవరప్పాడులోని వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ సూర్యనారాయణుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు వాడపల్లి కేశవాచార్యులు అభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రాధాకృష్ణ, కె.బాలయోగి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


తాళ్లపూడి: ప్రక్కిలంక రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కొవ్వూరు: కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని సుందరేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు మానేపల్లి సుందర గణేష్ ఆధ్వర్యంలో సూర్య భగవానుడికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. సూర్యనమస్కారాలు సమర్పించారు. అనంతరం భక్తులతో సామూహిక ఆదిత్య పారాయణం జరిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. కొవ్వూరు సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పాదేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు మా నేపల్లి సుబ్రహ్మణ్యస్వామి ఆధ్వర్యంలో సూర్య నారాయణుడికి పంచామృత అభిషేకాలు, సూర్య నమస్కారాలు చేశారు.


దేవరపల్లి సాయిబాబా ఆలయం వద్ద లక్ష్మీగణపతి హోమం

దేవరపల్లి: రథసప్తమి సందర్భంగా మండలంలోని అన్ని ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాల వద్ద పాలపొంగులు నిర్వహించారు. అనంతరం భక్తులు సూర్యనమస్కారాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. దేవరపల్లిలో షిరిడి సాయిబాబా 29వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయం వద్ద లక్ష్మీగణపతి హోమం, సూర్య నమస్కారాలు, మృత్యుంజయ హోమం ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. బంధపురంలో కోదండ రామాలయంలో ఆలయ ప్రధానార్చకుడు దేవులపల్లి రామకృష్ణశర్మ ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, సుజాత దంపతులు పూజ, హోమాల్లో పాల్గొని పూర్ణహుతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.


కొవ్వూరు సుందరేశ్వరస్వామి ఆలయంలో సూర్యనమస్కారాలు అందిస్తున్న దృశ్యం

వ్యసనాలకు బానిసలై డబ్బు కోసం వక్రమార్గం

- గంజాయి తరలిస్తున్న ఐదుగురు యువకుల అరెస్టు
- 10 కిలోలు స్వాధీనం


వివరాలు తెలుపుతున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

కొవ్వూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు అలవాటుపడి అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో గంజాయి విక్రయాలు చేపట్టిన ఐదుగురు యువకులను అరెస్టు చేసి 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ జి.దేవకుమార్ తెలిపారు. మంగళవారం కొవ్వూరులోని డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంజాయి తరలిస్తున్నారని వచ్చిన సమాచారంతో కొవ్వూరు ఎస్ఐ కె.జగన్మోహనరావు సిబ్బందితో దాడి చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 10 కిలోల గంజాయి కొనుగోలు చేసి తణుకు పరిసర ప్రాంతాల్లో విక్రయించడానికి తీసుకెళ్తున్న ఐదుగురు వ్యక్తులను కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి టోల్ గేటు సెంటర్ నుంచి నిడదవోలు వెళ్లే రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అరెస్టు చేశారు. పెరవలి మండలం తీపర్రుకు చెందిన మొగలాపు నవీన్‌కృష్ణచౌదరి, పెరవలి శిలువ సెంటర్ అరుంధతీపేటకు చెందిన చిన్నిమిల్లి శివకృష్ణ, సవరపు ప్రవీణ్, ఆచంట పెద్దపేటకు చెందిన కోట భాను సందీప్, తణుకు పాతూరుకు చెందిన కాకరపర్తి బాలాజీలను అరెస్టు చేసి వారి నుంచి 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ పేర్కొన్నారు. గంజాయి, మత్తు పదార్థాల విక్రయం, రాత్రుళ్లు మద్యం తాగి రోడ్లపై తిరుగుతున్న వారిని అరికట్టడానికి సబ్ డివిజన్ పరిధిలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఈగల్ టాస్క్‌ఫోర్సు టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్ర, జిల్లా బృందాలను సమన్వయం చేసుకుంటూ ఒకరికొకరు సమాచారం పంచుకుంటూ ఈ టీమ్ పనిచేస్తుందన్నారు. సమావేశంలో పట్టణ సీఐ పి.విశ్వం, ఎస్ఐ కె.జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఆకుకూరలు తినాలి

- కొవ్వూరు ఎంపీడీవో సుశీల
- గర్భిణులు, బాలింతలకు పంపిణీ


అంగన్వాడీ కేంద్రం వద్ద ఆకుకూరలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

కొవ్వూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం వేములూరు, పంగిడి గ్రామాల్లో పోషణవాటిక కార్యక్రమాన్ని ఎంపీడీవో కె.సుశీల సందర్శించారు. కొవ్వూరు సీడీపీవో డి.మమ్మీ ఆధ్వర్యంలో మంగళవారం కోడ్ నంబరు 35, 102 కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు ఆకుకూరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆకు కూరలు తినాలన్నారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు తింటే ఆరోగ్యవంతమైన, అందమైన పిల్లలు పుడతారన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే అనుబంధ ఆహారం క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. మొబైల్, టీవీసీరియల్స్‌కు దూరంగా ఉండాలని, ఆధ్యాత్మికతతో ఉంటే పుట్టే పిల్లలకు మంచి అలవాట్లు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగల్లు: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన వాటిని తింటేనే ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని ప్రకృతి వ్యవసాయశాఖ అధికారులు ప్రచారం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన ఆకుకూ రలు, కూరగాయలను స్థా నిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసి అమ్మకాలు చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే వారికి, అధికారులకు అవగాహన కల్పించడంతో పాటు కూరగాయలు విక్రయిస్తారు. ప్రకృతి వ్యవసాయం యూనిట్ మండల ఇన్‌చార్జి జి.రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందని ఎరువులు, క్రిమిసంహారక మందుల్లేని ఆరోగ్యకరమైన కూరలను మనమే పెరట్లో పండించుకొనేలా ప్రోత్సహించడం అవగాహన కల్పించడం దీని ముఖ్య ఉద్దేశమన్నారు. మనకు ఉన్న ఖాళీ స్థలంలో ఆకు, కూరగాయలు పండించికుని డబ్బులు ఆదా చేసుకోవడంతో పాటుగా ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు పండించుకోవచ్చునని చెప్పారు.


చాగల్లులో తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన స్టాల్

దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు దగ్ధం

- 5 హెక్టార్లకు వ్యాపించిన మంటలు
- మంటలను అదుపు చేసిన అటవీ, అగ్నిమాపక సిబ్బంది


రిజర్వు ఫారెస్టులో బ్రిడ్జి కౌంటీ వెనుక భాగంలో దట్టమైన పొగలతో ఎగిసిపడుతున్న మంటలు



రాజానగరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టులో మంగళవారం మంటలు వ్యాపించాయి. జాతీయ రహదారిని ఆనుకుని బ్రిడ్జి కౌంటీ వెనుక ప్రాంతంలోని ఈస్ట్ రిజర్వు ఫారెస్టులో దట్టమైన పొగలతో కూడిన మం టలు ఎగసిపడుతుండడంతో పరిసర గ్రామాల ప్రజలు, జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు ఆందోళనకు గురయ్యారు. ఫారెస్టులోని జామాయిల్ చెట్లలో ఐదు హెక్టార్ల విస్తీర్ణంలో నేలరాలిన ఆకులు, అలమలతో పాటు పొదలు మంటల్లో కాలిబూడిదయ్యాయి. దీన్ని గ్రౌండ్ ఫైర్ అంటారని, చెట్లకు ఏ నష్టం వాటిల్లలేదని అటవీ, అగ్ని మాపక అధికారులు వెల్లడించారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో అగ్నిప్రమాదం జరిగి రిజర్వు ఫారెస్టు దగ్ధమైంది. అటవీ, అగ్ని మాపక అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక యంత్రాలు ఫారెస్టులోకి ప్రవేశించేందుకు వీలులేకపోవడంతో బ్లోయర్ల సహాయంతో మంటలను అదుపు చేశారు. పరిసర ప్రాంతాల్లోని వారు కాల్చిపడేసిన, సిగరెట్, బీడీ, చుట్టల వల్ల అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని జిల్లా అగ్నిమాపకాధికారి మార్టిన్ లూథర్‌కింగ్, అసిస్టెంట్ ఫైర్‌ఆఫీసర్ శ్రీనివాస్ సందర్శించారు.

పరిశీలించిన మంత్రి దుర్గేష్


అగ్నిప్రమాద ప్రాంతాన్ని రాజానగరం ఎమ్మెల్యే బత్తులతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్ట్‌లో జరిగిన అగ్నిప్రమాదాన్ని అధికారుల చొరవతో చాలా వరకు అదుపు చేయగలిగామని రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. అగ్నిప్రమాద ప్రాంతాన్ని మంగళవారం ఆయన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ అగ్నిప్రమాదం మానవ ప్రమేయంతోనే జరిగినట్లుగా భావిస్తున్నామన్నారు. అగ్నిమాపక సి బ్బంది త్వరతగతిన వచ్చి మంటలను అదుపు లోకి తీసుకువచ్చారన్నారు. సకాలంలో స్పందించడం వల్ల వృక్షాలను కాపాడగలిగామన్నారు.

లలితేశ్వరి హత్యకేసులో మరో నిందితురాలి అరెస్టు

బిక్కవోలు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పందలపాకలో గతనెల 29న కురుపూడి ల లితేశ్వరి అనే వివాహితను కేబుల్ వైరును మెడకు బిగించి అతికిరాతకంగా హత్య చే సిన కేసులో ఏ2 గుంతికోలు వరలక్ష్మిని మంగళవారం బిక్కవోలులో అరెస్టు చేసినట్టు సీఐ సుమంత్ తెలిపారు. ఈ కేసులో ముందుగా వరలక్ష్మి కుమారుడు దుర్గాప్రసాద్‌ను గత నెల 30న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ కేసులో కొందరు నిందితులు లలితేశ్వరిని హత్య చేయడంలో సహకరించార ని గ్రామంలోని మహిళలు, కుటుంబసభ్యు లు ఈనెల 1న ఆందోళన చేపట్టారు. దీం తో సీఐ విచారణ చేపట్టగా లలితేశ్వరి హ త్యకేసులో వరలక్ష్మి పాత్ర కూడా ఉందని తేలడంతో ఆమెను అరెస్టు చేశారు.

ముసిన సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

కొవ్వూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో శ్రీ సుందర సాయి విగ్రహ ప్రతిష్ఠ 30 వార్షికోత్సవాలు మంగళవారం ముగిసాయి. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ పూజలు నిర్వహించారు. అర్చకులు సాయిబాబాకు తులసి, బిల్వ పత్రాలతో అర్చన, భక్తులతో సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, నిడదవోలు సత్యనారాయణమూర్తి బృందంతో సంకీర్తనలు నిర్వహించారు. నారాయణ సేవలో భాగంగా ప్రసాద వితరణ చేశారు.


అనారోగ్యంతో బాధపడుతున్న బాలికకు ‘బీబీజే’ ఆర్థిక సాయం

పెరవలి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పెరవలిలో కల్యాణి మౌనిక అనే పాప అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆలిండియా బీబీజే సేవా సంఘం ద్వారా గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమంలో రూ.లక్ష ఆమె కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. పేర్ల నాగులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మోషే బిక్షం, మిరియాల వెంకట్, మైలుపాటి తుకారం, విభూదే దుర్గారావు , కర్రి యేసుబు, కల్యాణ వెంకటేశ్వరరావు, మోషే, సతీష్ పాల్గొన్నారు.

నిడదవోలు నుంచి మహా కుంభమేళాకు బస్సు

నిడదవోలు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు ఆర్టీసీ డిపో నుంచి మహా కుంభమేళా, కాశీ యాత్ర బస్సును డిపో మేనేజర్ కె.వెంకటేశ్వర్లు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిడదవోలు నుంచి కుంభమేళాకు బయలుదేరిన బస్సు మార్గమధ్యలో వివిధ పుణ్యక్షేత్రాలను దర్శించుకుని మహాకుంభమేళా దర్శన అనంతరం తిరిగి నిడదవోలు చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పేరాబత్తులను గెలిపించండి



కొవ్వూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పేరాబత్తుల రాజశేఖరంను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం కొవ్వూరు పట్టణంలోని 7, 8, 9 వార్డు సచివాలయాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యువత భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం బలపర్చిన అభ్యర్థి రాజశేఖరంకు అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు దాయన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్, కాగిత రఘు, తోరం నగేష్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్ స్క్రీన్1	సంక్రాంతికి వస్తున్నాం
వై.స్క్రీన్2	ఏజెంట్ గయ్ 001
అనన్య	మదగజరాజు

నిడదవోలు

వీ మ్యాక్స్	మదగజరాజు
రాధాకృష్ణ	సంక్రాంతికి వస్తున్నాం
శ్రీగణపతి	డాకు మహరాజ్

దేవరపల్లి

శ్రీరామ్‌నాథ్	గేమ్ ఛేంజర్
త్రినాథ్	డాకూ మహరాజ్